కోటగిరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో..
వీక్షించండి చానల్
NS99
CHANNEL
దగా స్థానంలో నిగా వేసే చానల్

దగా స్థానంలో నిఘా వేసే జాతీయ దిన పత్రిక

# నీలగిరి శంఖారావమ్

సమగ్ర సమాచార దర్శిని తెలుగు జాతీయ దినపత్రిక

నల్లగొండ సంపుటి :05 సంచిక :132 ఎడిటర్ : కోటగిరి చంద్రశేఖర్ బుధవారం 09-09-2026 పేజీలు : 4 వెల : రూ. 3/-

## గాయపడ్డ మహిళా పోలీసులను పరామర్శించిన మంత్రి సీతక్క



హైదరాబాద్,ప్రజాస్వామ్య దేవాలయం సాక్షిగా విధి నిర్వహణలో ఉన్న మహిళా పోలీసులపై సాగిన దురుసు ప్రవర్తన రాజధానిలో పెను దుమారం రేపుతోంది. కాపాడాల్సిన ప్రజాప్రతినిధులే చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం వెనుక అసలేం జరిగింది? నిబంధనల ప్రకారం నడుచుకున్న మహిళా రక్షకులను అంతలా వేధించి, బెదిరించాల్సిన అవసరం ఎందుకొచ్చింది? అసెంబ్లీ వద్ద జరిగిన ఆ అవమానకర ఘటనల వెనుక ఉన్న నిష్ఠుర సత్యాలేమిటి?గత నిరసన ఘర్షణల్లో గాయపడిన, అవమానానికి గురైన మహిళా పోలీసు అధికారులను పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితులు తమ ఆవేదనను కన్నీటిపర్యంతమై మంత్రికి వెళ్లగక్కారు. తాము శాంతిభద్రతల పరిరక్షణ విధుల్లో నిమగ్నమై ఉండగా, కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అసభ్యకరంగా ప్రవర్తించారని, అనుచితంగా ప్రవర్తిస్తూ నెట్టివేశారని మంత్రికి దృశ్య సహిత ఆధారాలను చూపించారు. నిరసన ముసుగులో ఒంటిపై టీషర్టులను విసిరేస్తూ, బరితెగించి మీదకు దూసుకొచ్చారని వాపోయారు. "మేము మళ్లీ అధికారంలోకి వచ్చాక మీ అంతు చూస్తాం" అంటూ కొందరు నేతలు బెదిరింపులకు దిగారని పేర్కొన్నారు.సామాజిక మాధ్యమాల్లో, వార్తల్లో వస్తున్న దృశ్యాలు చూసి తమ కుటుంబ సభ్యులు తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంట్లో వాళ్ళు ఆందోళన చెందుతూ, ఇలాంటి విధులు చేయాల్సిన అవసరం లేదంటూ ఒత్తిడి తెస్తున్నారని మంత్రి ఎదుట కన్నీరుమున్నీరయ్యారు. బాధిత సిబ్బంది ఆవేదనను శ్రద్ధగా విన్న మంత్రి సీతక్క వారికి కొండంత అండగా నిలిచారు. "ఎవరూ అధైర్యపడొద్దు. ప్రజల రక్షణ కోసం నిలిచే సిబ్బందికి ప్రజా ప్రభుత్వం సంపూర్ణంగా తోడుంటుంది. బెదిరింపులకు లొంగకుండా మీ కర్తవ్యాన్ని మీరు నిర్భయంగా నెరవేర్చండి" అని స్పష్టమైన భరోసా ఇచ్చారు. మహిళా పోలీసుల పట్ల అనుచితంగా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు.

## 22ఎపై చర్చపెట్టమని అడిగాం: ఏలేటి మహేశ్వర్ రెడ్డి



హైదరాబాద్: కాంగ్రెస్, బిఆర్ఎస్ మధ్య మిత్ర బంధం ఉందని బిజెపి ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలిపారు. మంత్రి పదవులు కలిసి అనుభవించింది కాంగ్రెస్, బిఆర్ఎస్సేనని అన్నారు. రెండో రోజు అసెంబ్లీ సమావేశాల సందర్భంగా శాసన సభలో మహేశ్వర్ రెడ్డి ప్రసంగించారు. 22ఎపై చర్చపెట్టమని అడిగామని, ఎప్పుడూ.. ఏ రోజు చర్చ జరుపుతారో స్పష్టం చేయాలని మంత్రికి వేల కోట్లపై వివరాలు చెబుతామని మహేశ్వర్ రెడ్డి అన్నారు. మహిళా ఎమ్మెల్యేలపై అనుచితంగా ప్రవర్తించిన తీరుపై అధికార పార్టీ క్షమాపణ చెప్పాలని, స్పీకర్ స్థానాన్ని అవమానించనందుకు బిఆర్ఎస్ క్షమాపణ చెప్పాలని ఏలేటి మహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు.

## కలియుగ దుశ్శాసనుడిలా రేవంత్ రెడ్డి :హరీష్ రావు



హైదరాబాద్:సబితా ఇంద్రారెడ్డి గొంతు పిసికి, సునీతా లక్ష్మారెడ్డి చీర లాగి యావత్ మహిళా లోకాన్ని అవమానించారు. ఇది గౌరవ సభ కాదు 'కౌరవ సభ'.. రేవంత్ రెడ్డి కలియుగ దుశ్శాసనుడు. దాడికి గురైన మహిళా ఎమ్మెల్యేలపైనే రివర్స్ కేసులు పెడతారా? ఉల్టా చోర్ కొత్వాల్ కో డాంటే అన్నట్లుగా తయారైంది పోలీసుల తీరని మాజీ మంత్రి హరీ?ష్ రావు అరోపించారు.స్పీకర్ పట్ల మాకు పూర్తి గౌరవం ఉంది.. మా సభ్యుడు క్షమాపణ చెప్పినా కూడా అరెస్ట్ చేసి జైలుకు పంపారు. ఒకే తప్పుకు ఎన్ని శిక్షలు వేస్తారో మీ విజ్ఞతకే వదిలేస్తున్నాం. దళితులపై కాంగ్రెస్కు నిజంగా ప్రేమ ఉంటే.. ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ ఏమైంది? అంబేద్కర్ విగ్రహానికి తాళాలు ఎందుకు వేశారని ప్రశ్నించారు.మాట్లాడే అవకాశం ఇచ్చిన స్పీకర్ కి ముందుగా ధన్యవాదాలు. మహిళా శాసనసభ్యుల మీద జరిగిన దాడిని పోలీసులు పరిశీలిస్తారని మంత్రి శ్రీధర్ బాబు గారు చెప్పడం విడ్డూరంగా ఉంది. శ్రీధర్ బాబు కి కూడా అక్కాచెల్లెళ్లు ఉన్నారు.. సొంత అక్కాచెల్లెళ్ల మీద ఇలాంటి దారుణమైన దాడి జరిగితే కేవలం పరిశీలిస్తాం అని సరిపెట్టుకుంటారా. ఆయన నుంచి కనీస సానుభూతి, విచారం ఆశించాం కానీ అది జరగలేదు. మాజీ హోంమంత్రి సబితా ఇంద్రారెడ్డి పై మగ పోలీసులు దాడి చేశారు, ఆమె గొంతు పిసికారు.. ఇదంతా వీడియోల్లో స్పష్టంగా కనిపిస్తోంది. మరో మాజీ మంత్రి, మహిళా ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి రి చీర లాగడంతో ఆమె కన్నీరు పెట్టుకున్న దృశ్యాలను మనమంతా చూశాం. ఇంత దారుణం జరిగినా ఇప్పటివరకు ఎలాంటి విచారణ జరగలేదు. సీపీకి, పోలీస్ స్టేషన్లో కంప్లైంట్ ఇస్తే.. న్యాయం చేయాల్సింది పోయి, దాడికి గురైన సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కోవా లక్ష్మి గారి మీదే రివర్స్ కేసులు నమోదు చేశారు. ఉల్టా చోర్ కొత్వాల్ కో డాంటే అన్నట్లుగా తయారైంది పోలీసుల తీరు. ఇది కేవలం బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన దాడి కాదు, రాష్ట్రంలోని యావత్ మహిళా లోకంపై జరిగిన దాడి. వాళ్లను తీవ్రంగా కించపరిచారు. ఇదెక్కడి పద్ధతి స్పీకర్ గారు. మీరే మమ్మల్ని కాపాడాలి, మీరే మా రెస్క్యూకి రావాలి. ఈ అసెంబ్లీ ఇప్పుడు గౌరవ సభ కాదు, కౌరవ సభగా మారిపోయింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలియుగ దుశ్శాసనుడిలా మారారు. ఆనాడు మహాభారతంలో కౌరవులకు పట్టిన గతే, ఈరోజు కాంగ్రెస్ పార్టీకి కూడా పడుతుంది. స్పీకర్ గారు, మీరంటే మాకు ఎంతో గౌరవం. వ్యక్తిగతంగా మీ పట్ల మాకు ఉన్న గౌరవాభిమానాలు ఎంతటివో మీ మనసుకు కూడా తెలుసు. నిన్న జరిగిన ఘటనలో మా సభ్యుడు తాతా మధు ఆ మాటలను స్పీకర్ ని ఉద్దేశించి అనలేదని స్పష్టం చేశారు. ఒకవేళ అలా భావించి ఉంటే ఆ పదాలను విత్డ్రా చేసుకుంటున్నానని, విచారం వ్యక్తం చేస్తున్నానని లిఖితపూర్వకంగా మీడియా ముఖంగా క్షమాపణలు కూడా చెప్పారు. మీరంటే మాకు ఎనలేని అభిమానం. మీరు నొచ్చుకుని ఉంటే పార్టీ తరఫున మేం కూడా విచారం వ్యక్తం చేస్తున్నాం.

## తప్పుదోవ పట్టించేవారు ప్రతి మలుపు వద్దా ఉంటారు.. రాహుల్‌పై మోదీ విమర్శలు



న్యూఢిల్లీ,యువత ఆకాంక్షలు, గళం.. విపక్షాల అబద్ధాలను అధిగమిస్తాయని ప్రధాని మోదీ అన్నారు. తప్పుదోవ పట్టించాలని చూసేవారు మన ప్రయాణంలో ప్రతి మలుపు వద్దా కనిపిస్తారని, కానీ భారత యువత సత్యాన్నే అనుసరిస్తుందని చెప్పారు. దేశ భవిష్యత్తును వారే నిర్ణయిస్తారని పేర్కొన్నారు. కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ ' (విద్యార్థుల ప్రతిధ్వని) పేరిట విద్యార్థులతో మాట్లాడుతోన్న సంగతి తెలిసిందే. దానిని ఉద్దేశించే మోదీ విమర్శలు చేశారు. గుజరాత్ లోని వడోదరలో 'నమో ఫర్ వికసిత్ భారత్' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు."దేశంలో పని సంస్కృతిలో వచ్చిన మార్పునకు వెస్టర్న్ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ ఒక ఉదాహరణ. దానికి సంబంధించి చివరి దశకూడా పూర్తయింది. 2004లో ఈ ప్రాజెక్టను ప్రతిపాదించారు. దీని అమలు కోసం 2006లో ఒక సంస్థను ఏర్పాటు చేశారు. 2014 వరకు దానికి సంబంధించిన ఫైళ్లు అక్కడక్కడే తిరిగాయి" అని యూపీఏ పాలనపై మోదీ ధ్వజమెత్తారు. 10 ఏళ్లలో వారు 50వేల టాయిలెట్లు కూడా కట్టించలేదని, తాము మాత్రం 50వేల రైలు కోచ్‌లను నిర్మించామని వెల్లడించారు.అనంతరం యువత గురించి మాట్లాడిన ప్రధాని.. ఏఐ యుగానికి అంతా సిద్ధంగా ఉండాలన్నారు. ఏఐ నైపుణ్యాలు ఐటీ రంగానికి మాత్రమే పరిమితం కాకూడదని సూచించారు. అలాగే రూఫ్‌టాప్ సోలార్ విస్తరణ గురించి ప్రస్తావించారు. "ఇప్పుడు ఎన్నో కుటుంబాలు ఎలక్ట్రిసిటీ ఉత్పత్తిదారులుగా మారిపోయాయి. సౌర ఉత్పత్తి, అమర్చడం, సర్వీస్ విస్తరించడంతో యువతకు ఉపాధి అవకాశాలు పెరిగాయి" అని పేర్కొన్నారు. ఇప్పుడు దేశం చిప్స్ నుంచి షిప్స్ వరకూ తయారీ రంగంలో కొత్త చరిత్ర లిఖిస్తోందన్నారు.

ధురంధర్ పాటతో మోదీకి స్వాగతం..

'నమో ఫర్ వికసిత్ భారత్' కార్యక్రమంలో భాగంగా మోదీ వస్తుండగా.. వేదికపైన ధురంధర్ సినిమాలోని ', క్వీన్ చిత్రంలోని 'We Will Rock You పాటలు వినిపించాయి. యువత నినాదాల మధ్య ప్రధానిని ఘనంగా స్వాగతించారు.

### ఆర్మీ అయుధాల చోరీ కేసు..దర్యాప్తు ముమ్మరం

హైదరాబాద్ :ఆర్మీ ఆయుధాల చోరీ కేసులో దర్యాప్తు కొనసాగుతోంది . అనుమానితుల ఎలిమినేషన్ ప్రాసెస్ స్టార్ట్ చేశామని మల్కాజ్ గిరి పోలీసు కమిషనర్ సుమతి వెల్లడించారు. ఒక క్రమపద్ధతిలో దర్యాప్తు చేస్తున్నాం,. అన్ని ఏజెన్సీలతో కలిసి పని చేస్తున్నాం. త్వరలోనే కేసు మిస్టరీని చేధిస్తాం. కేసు ఇన్విస్టిగేషన్ ఇంకా కొనసాగుతుందని అన్నారు.

## తెలంగాణలో ఆటో ఛార్జీల పెంపుపై.. ప్రభుత్వం కీలక ప్రకటన..



హైదరాబాద్,తెలంగాణ రాష్ట్రంలో ఆటో డ్రైవర్లు, కార్మికుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకట్ స్వామి స్పష్టం చేశారు. సోమవారం సచివాలయంలో ఆటో కార్మిక సంఘాల ప్రతినిధులతో మంత్రులు, ఉన్నతాధికారులు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లు, కార్మిక సంఘాల ప్రతినిధులు తమ సమస్యలను మంత్రులకు వివరించారు. వాటిపై మంత్రులు, ఉన్నతాధికారులు సుదీర్ఘంగా చర్చించారు. గత ఆగస్టు 23న జరిగిన సమావేశంలో చర్చించిన అంశాలపై ఇప్పటి వరకు తీసుకున్న చర్యలను కూడా సమీక్షించారు. ఈ పలు కీలక నిర్ణయాలను ప్రకటించారు.2012 తర్వాత రాష్ట్రంలో ఆటో ఛార్జీల పెంపు జరగలేదని, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఛార్జీలను పెంచేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. దీనిపై అధికారులతో కూడిన కమిటీని ఏర్పాటు చేస్తున్నామని, ఆ కమిటీ ఇచ్చే నివేదిక ఆ ధారంగా త్వరలోనే నూతన ఛార్జీలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఆటో డ్రైవర్ల చిరకాల కోరికైన సంక్షేమ బోర్డు ఏర్పాటుపై ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. త్వరలోనే దీనిపై క్యాబినెట్లో చర్చించి, శాసనసభలో ప్రత్యేకబిల్లును ప్రవేశ పెడతామని వెల్లడించారు.అలాగే డ్రైవర్ల కోసం ప్రమాద, సహజ మరణ బీమాతో కూడిన ఇందిరమ్మ పాలసీని తీసుకురావాలని ప్రభుత్వం యోచిస్తోందన్నారు. ప్రైవేట్ అగ్రిగేటర్ల దోపిడీ నుంచి ఆటో డ్రైవర్లను రక్షించేందుకు ఓలా, ఉబెర్ తరహాలో ప్రభుత్వమే ఒక ప్రత్యేక యాప్‌ను రూపొందిస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఇదిలాఉంటే.. టీజీఎస్ఆర్టీసీ ద్వారా ఈవీ ఆటోలను ప్రవేశపెట్టి 'లాస్ట్ మైల్ కనెక్టివిటీ' పాలసీ తీసుకురానున్నట్లు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

## స్పీకర్ ఇలా చేయొద్దు.. అలా చేయొద్దు అని చెప్పడానికి వాళ్లెవరు?: శ్రీధర్ బాబు



హైదరాబాద్: స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ను బిఆర్ఎస్ ఎంఎల్ఎ హరీష్ రావు బెదిరించే ప్రయత్నం చేస్తున్నారని మంత్రి శ్రీధర్ బాబు మండిపడ్డారు. రెండో రోజు తెలంగాణ అసెంబ్లీలో శాసన సభ ప్రారంభంకాగానే గందరగోళం నెలకొంది. సభలో బిఆర్ఎస్ సభ్యుల నినాదాలు చేయడంతో పాటు స్పీకర్‌తో హరీష్‌రావు వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు ప్రసంగించారు. సభను ఎలా నడపాలనే అంశంపై బెదిరింపు ధోరణిలో మాట్లాడడం సరికాదని సూచించారు. స్పీకర్ ఇలా చేయొద్దు.. అలా చేయొద్దు అని చెప్పడానికి వాళ్లెవరు? అని అడిగారు. స్పీకర్ ను బిఆర్ఎస్ సభ్యులు బెదిరించే తీరు బాగోలేదని ధ్వజమెత్తారు. స్పీకర్ స్థానంలో ఉన్న వ్యక్తిపై అలా మాట్లాడటం ఎప్పుడూ చూడలేదన్నారు. అనుకుంటే.. భావిస్తే ఏంటి.. వీడియోల్లో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన దాడిపై నివేదిక ఇవ్వాలని స్పీకర్ ఆదేశించారని, స్పీకర్‌పై జరిగినదాన్ని పక్కనపెట్టాలనడం ఏంటని ప్రశ్నించారు. తొలి రోజు అసెంబ్లీ సమావేశాల సందర్భంగా జరిగినూ ఘటనలపై నివేదిక తీసుకుంటున్నామని, బిఆర్ఎస్ ఎంఎల్ఎలు సబిత, సునీత లక్ష్మారెడ్డిపై తమకు గౌరవం ఉందని, ఇద్దరు మహిళా ఎమ్మెల్యేలతో పనిచేసిన అనుభవం తమకు ఉందని శ్రీధర్ బాబు తెలియజేశారు.

## మీడియా ముందు భావోద్వేగానికి గురైన స్పీకర్.. హరీష్ రావుపై ఫైర్!

హైదరాబాద్, నేను జనరల్‌గా బీఆర్ఎస్‌కి మైక్ ఇవ్వొద్దు కానీ ప్రజాస్వామ్య పద్ధతిలో నేను సభని నడిపిస్తున్నానని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. నిన్న జరిగిన దానికి ఈ రోజు సభలో హరీష్, బీఆర్ఎస్ పార్టీ క్షమాపణ చెప్తారు అనుకున్నాను. కానీ వారి మాటలతో నేను మనస్తవనికి గురైయ్యానని స్పీకర్ అన్నారు. నేను ఎప్పుడు మీడియా ముందుకు రాను. ఇది మొదటి సారి అలాగే కోపానికి కూడా రావడం కుడా మొదటిసారి అని స్పీకర్ అన్నారు. నాకు సబితా కి ఒక సమయంలో జంగ్ నడుస్తుండే కానీ ఎప్పుడు ఎవరు ఒక మాట అనుకోలేదుని అన్నారు.

హరీష్ రావు అలా మాట్లాడొద్దు..

ఈ రోజు ఛైర్‌లో కూర్చోవాలంటే బాధగా ఉంది. ప్యానల్ స్పీకర్‌ని పెట్టి సభ నడిపించాలని కోరానని అన్నారు. హరీష్ రావు అలా మాట్లాడడం సరికాదు. సీనియర్ నాయకులు, మంత్రిగా పని చేసిన అనుభవం మీకు ఉందని, గేట్ -3 నుండి అంత స్పీకర్ పరిధిలోకే వస్తుందని అన్నారు. బహుశా వారికి తెలియదు ఏమో.. 5 సార్లు ఎమ్మెల్యేగా నేను పోటీ చేశాను. 3 ఏళ్లనుండి స్పీకర్‌గా ఉన్నానని, నేనే నేరుగా చర్యలు తీసుకోవచ్చని వారిపై కోమటిరెడ్డి, సంపత్‌ని వాళ్ళు అలాగే చేశారని




## కేసీఆర్‌కు ఏమైనా జరిగితే రాష్ట్రం అగ్నిగుండమైతది



హైదరాబాద్,సీఎం రేవంత్ రెడ్డి తన వెయ్యి రోజుల పాలనలో వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి రాష్ట్రంలోకి ఫ్యాక్షన్ రాజకీయాలను ప్రవేశపెడుతున్నారు. ఒకవైపు అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తూనే మరోవైపు కొంతమంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కేసీఆర్ ఫామ్ హౌస్‌పై దాడికి పంపించారు. అసెంబ్లీ నడుస్తుండగా స్వయంగా ముఖ్యమంత్రే అధికార పార్టీ ఎమ్మెల్యేలను ప్రతిపక్ష పార్టీ అధినేతపై దాడికి పంపడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంపై ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేలు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. పోలీసులను రేవంత్ రెడ్డి గూండాల్లా ప్రతిపక్ష పార్టీపై ప్రయోగిస్తున్నారని విమర్శంచారు. కాంగ్రెస్ గూండాలను పోలీస్ రక్షణ కల్పిస్తున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ఏకంగా 500 మంది గూండాలను కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, పోలీస్ ఎస్కార్టుతో కేసీఆర్ ఫామ్ హౌస్‌పైకి ఎలా ఉసిగొల్పుతారని ప్రశ్నించారు. తమ అధినేత కేసీఆర్‌కు ఏమైనా జరిగితే రాష్ట్రం అగ్నిగుండంలా మారుతదని హెచ్చరించారు.కేసీఆర్ ఫామ్‌హౌస్ అంటే తమ అధినేత నివాసమని, తమ అధినేత నివాసమంటే తమ నివాసమని, తమ సొంత ఇంటికి తాము వెళ్తుంటే అడ్డుకుంటున్న మీరు.. కాంగ్రెస్ గూండాలను మాత్రం పోలీస్ రక్షణతో ఎలా పంపిస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రశ్నంచారు. మా ఇంటికి వెళ్లకుండా అడ్డుకుంటున్న పోలీసులు, కాంగ్రెస్ గూండాలను ఎందుకు అడ్డుకోవడం లేదని నిలదీశారు. ముందుగా వాళ్లను ఆపి, తర్వాత తమను ఆపాలని అంటున్నారు.

సంపాదకీయం

బుధవారం 09-09-2026

# బడికి దూరమై... భవిత ప్రశ్నార్థకమై

గత దశాబ్ద కాలంలో దేశంలో 94వేల ప్రభుత్వ పాఠశాలలు మూతపడినట్లు నీతిఆయోగ్ నివేదిక చెబుతోంది. అంటే, రోజుకు సుమారు 25 పాఠశాలలు మూతపడినట్లు లెక్క. పాఠశాలల క్రమబద్ధీకరణ, మూసివేత విద్యాహక్కు చట్టం ఉనికికే విఘాతంలా మారుతున్నాయి. ప్రభుత్వ బడులు అందుబాటులో లేక, ప్రైవేట్ ఫీజుల ధాటికి తట్టుకోలేక పలువురు చిన్నారులు చదువులకు దూరమవుతుండటం ఆందోళనకరం. ముఖ్యంగా దీనివల్ల పేద, గ్రామీణ విద్యార్థుల భవిత అగమ్యగోచరమవుతోంది. పేదపిల్లలకు విద్యను అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలలు అంతకంతకూ తగ్గిపోతుండటం విచారకరం. ఆ బడుల్లో విద్యార్థుల నమోదూ తగ్గుతోంది. 2005లో దేశవ్యాప్తంగా 71 శాతంగా ఉన్న నమోదు, 2024-25 నాటికి 49.24 శాతానికి పడిపోయింది. 2025-26 విద్యా సంవత్సరంలో దేశవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు 86 లక్షల విద్యార్థులను కోల్పోగా, ప్రైవేట్ బడుల్లో చేరికలు అదనంగా 88 లక్షల మేరకు పెరిగినట్లు నివేదికలు చెబుతున్నాయి. గత దశాబ్దంలో ప్రైవేట్ బడులు 2.88 లక్షల నుంచి 3.31 లక్షలకు చేరాయి. ఈ నేపథ్యంలో దారిద్ర్యరేఖకు దిగువనున్న కుటుంబాల పిల్లల చదువుల సంగతేంటనే ప్రశ్న తలెత్తుతోంది. క్రమబద్ధీకరణ నెపంతో అన్ని రాష్ట్రాల్లో ప్రభుత్వ బడులు మూతపడుతుండటంతో ఒక కిలోమీటర్ పరిధిలో ప్రాథమిక, మూడు కిలోమీటర్ల పరిధిలో అప్పర్ ప్రైమరీ స్కూలు ఉండాలనే విద్యాహక్కు నిబంధన బుట్టదాఖలవుతోంది. ఆర్టికల్ 21ఏ ప్రకారం విద్యా హక్కును బలోపేతం చేయడానికి దశాబ్దాలుగా కొనసాగుతున్న కృషి, నాణ్యమైన చదువులపై మిగిలిన ఆశ కూడా ఆవిరయ్యే పరిస్థితి కనిపిస్తోంది. పట్టణాలకు వలసలు, మౌలిక వసతుల కల్పనలో అలసత్వం, పాతకాలపు బోధనా విధానాలు, పాఠశాల నిర్వహణలో తల్లిదండ్రుల పాత్ర తగ్గడం, యాజమాన్య కమిటీల పాత్ర నామమాత్రంగా మారడం వంటి పరిణామాలు ప్రైవేట్ రంగానికి సానుకూలంగా మారుతున్నాయి. పరిస్థితులు ఇలాగే క్లిష్టంగా కొనసాగితే ముఖ్యంగా ఆడపిల్లల చదువుకు భరోసా ఉండదు. సమీపంలో పాఠశాల లేకపోవడం, ఇప్పటికీ లింగ వివక్ష తగ్గకపోవడంతో బాలికలు బడి మానేసి ఇంటి పనులకే పరిమితమై బాల్య వివాహాల విషవలయంలో చిక్కుకుపోయే ముప్పుంది. బడికి దూరమయ్యే మగపిల్లలు బాల కార్మికులుగా మగ్గిపోయే ప్రమాదం పొంచి ఉంది.

మౌలిక సదుపాయాలకూ కొరతే...

ఈ విద్యా సంవత్సరంలో దేశవ్యాప్తంగా 4,791 ప్రభుత్వ పాఠశాలలను మూతవేయడమో లేదా క్రమబద్ధీకరించడమో చేశారు. దీంతో పిల్లలను దూర ప్రాంతాలకు పంపలేక, ప్రైవేట్ భారాన్ని మోయలేక దినసరి కూలీలు, వలస జీవులు, వ్యవసాయ కార్మికులు వంటి వారు తమ బిడ్డల భవితపై ఆందోళన చెందుతున్నారు. విద్యాహక్కు చట్టం ఉచిత నిర్బంధ విద్యకు పట్టంకట్టినప్పటికీ పాఠశాలల క్రమబద్ధీకరణ, మూసివేత వంటి కీలక నిర్ణయాల్లో ప్రజల భాగస్వామ్యం లేకుండానే ప్రభుత్వాలు ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నాయి. మరోవైపు, మౌలిక వసతుల కల్పనలో 98 శాతం ప్రగతి సాధించినట్లు యూడైస్-2025 నివేదిక వెల్లడించింది. కానీ, ప్రథమ్ నివేదిక 2024 ప్రకారం వాస్తవాలు భిన్నంగా ఉన్నాయి. బాలికలకు వినియోగ యోగ్యమైన పారిశుద్ధ్య వసతి 72 శాతం బడుల్లోనే ఉంది. సుమారు 67వేల పాఠశాలల్లో మరుగుదొడ్లు వాడుకోవడానికి పనికిరావు. 77.7 శాతం బడుల్లో తాగునీటి సౌకర్యం ఉన్నా అందులో ఇరవైశాతం చోట్ల అది నిరుపయోగమవుతోంది. సరైన క్రీడా ప్రాంగణాలైతే 66 శాతం బడుల్లోనే ఉన్నాయి. ఎన్‌సీఈఆర్‌టీ సర్వే ప్రకారం, తొమ్మిదో తరగతి విద్యార్థుల్లో 71 శాతం చిన్నచిన్న కాన్సెప్టులను అర్థం చేసుకోలేని స్థితిలో ఉన్నారు. మూడో తరగతి విద్యార్థుల్లో 40 శాతంమంది చిన్న కథలను కూడా చదివి అర్థం చేసుకోలేకపోతున్నారు. 36 శాతం మంది కూడికలు కూడా చేయలేకపోతున్నారు. కనీస సామర్థ్యాలు సాధించలేని పిల్లల్లో బడిపై పెరుగుతున్న విముఖత, ఉపాధ్యాయులపై పనిఒత్తిడి వంటివన్నీ కలిసి చదువులకు దూరమవుతున్న విద్యార్థుల సంఖ్య పెరుగుతూనే ఉంది. ఈ పరిస్థితులు మారాలంటే, ప్రభుత్వాలు, పాఠశాల యాజమాన్యాలు ఉమ్మడిగా, ప్రాంతాల వారీగా ప్రణాళికలు రచించాలి. ప్రాథమిక, ఎలిమెంటరీ స్థాయిదాకా విద్యాహక్కు చట్టం నిబంధనల మేరకు ఆవాసాలకు దగ్గరలో పాఠశాలలు కొనసాగించాలి. తగినంత మంది ఉపాధ్యాయులతో విద్యార్థులకు సమాన ప్రావీణ్యాన్ని అందించాలి. క్రమబద్ధీకరణ, మూసివేత ప్రక్రియకు స్వస్తి చెప్పి ప్రత్యామ్నాయాలను యోచించాలి. పిల్లలను ఆకట్టుకోలేని సంప్రదాయ బోధన పద్ధతులను మానేయాలి. సిలబస్ పూర్తి చేయడమే పరమావధి అనే ధోరణిని వీడాలి. అభ్యసన లేమితో బాధపడే విద్యార్థులను తీర్చిదిద్దడంలో అలసత్వం వదలాలి. మార్కులపైనే దృష్టి పెట్టే దృక్పథాన్ని మార్చుకోవాలి. బోధన, వ్యూహాలు, పాఠ్య ప్రణాళికల తయారీలో పాఠశాలలకు స్వయంప్రతిపత్తి కల్పించాలి.

నిరంతర శిక్షణ

యూడైస్-2024 అంచనాల ప్రకారం శిక్షణ పొందిన ఉపాధ్యాయుల్లోనూ చాలామందిలో బోధన నైపుణ్యాలు లోపించాయి. కాబట్టి ఉపాధ్యాయులకు నామమాత్రపు శిక్షణతో సరిపెట్టకూడదు. అనుభవాత్మక, ప్రాజెక్ట్ ఆధారిత విద్యను అందించేలా, సింగపూర్ పద్ధతిలో 'టీచ్ లెస్-లెర్న్ మోర్' తరహాలో వారిని తీర్చిదిద్దాలి. విద్యార్థి సమయాన్ని అభ్యసనకు, సాధనకు, రివిజన్‌కు కేటాయించేలా బోధనా వ్యూహాలు అమలు చేయాలి. సేవ్ ది చిల్డ్రన్, సిప్స్, యూనిసెఫ్, తెలుగు రాష్ట్రాల పాఠశాల విద్యాశాఖలు రూపొందించి అమలు చేసిన 'లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్' కార్యక్రమాన్ని బలోపేతం చేయాలి. నీతిఆయోగ్ చెప్పినట్లు బోధనేతర పనులకు స్వస్తి చెప్పి, యాప్‌ల బెడదను తగ్గిస్తే ఉపాధ్యాయులకు బోధన కోసం మరింత సమయం దొరుకుతుంది. సరైన శిక్షణ, నిరంతర పఠనం, వినూత్న బోధనకు టీచర్లు అంకితమయ్యేలా ప్రోత్సహించాలి. విద్యార్థుల ప్రగతిలో ముందంజలో ఉన్న రాష్ట్రాల వ్యూహాలను అధ్యయనం చేయడం ద్వారా బోధన ప్రక్రియలను మెరుగుపరచుకోవచ్చు. పాఠశాల యాజమాన్య కమిటీలను బలోపేతం చేసి, బడి విషయంలో ప్రభుత్వం తీసుకునే నిర్ణయాల్లో అది ప్రధాన పాత్ర పోషించేలా చూడాలి. ఏకోపాధ్యాయ పాఠశాల వ్యవస్థకు స్వస్తి పలకాలి. నాణ్యమైన చదువులే గీటురాళ్లుగా సర్కారీ బడిని తీర్చిదిద్దాలి.

# ప్రజాపాలనకు వెన్నెముక ప్రభుత్వ ఉద్యోగులే!



హైదరాబాద్,తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల జేఏసీ ధర్నాతో ఉద్యోగుల పెండింగ్ సమస్యలు మరోసారి తెరపైకి వచ్చాయి. పీఆర్సీ, డీఏలు, పెన్షన్, హెల్త్ కార్డులపై ప్రభుత్వం నిర్మాణాత్మక చర్చలు జరిపి పరిష్కారం చూపాలి.

ప్రజాపాలనకు వెన్నెముక ప్రభుత్వ ఉద్యోగులే!

ఆగస్టు 27న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద రాష్ట్ర ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ ధర్నా తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగ వర్గాల్లో పెరుగుతున్న అసంతృప్తికి ప్రతీకగా నిలిచింది. రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి వేలాది మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పింఛనర్లు పాల్గొని తమ పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ నిరసన కేవలం వేతనాలు, భత్యాలు లేదా పెన్షన్ అంశాలకే పరిమితం కాలేదు.. ప్రజాపాలనలో ప్రభుత్వ ఉద్యోగుల పాత్ర, సేవా భద్రత, ప్రభుత్వ యంత్రాంగ సమర్థత వంటి కీలక అంశాలను మరోసారి ప్రజా చర్చలోకి తీసుకొచ్చింది.

నిర్మాణాత్మక సంభాషణ అవసరం..

ఉద్యోగ సంఘాలు కొత్త పీఆర్సీ ప్రకటించడం, పెండింగ్ డీఏలను విడుదల చేయడం, హెల్త్ కార్డులను పూర్తిస్థాయిలో అమలు చేయడం, ఏరియర్లు, పింఛనర్ల బకాయిలను చెల్లించడం, సీపీఎస్ స్థానంలో ఓపీఎస్ అమలు చేయడం వంటి ప్రధాన డిమాండ్లను ప్రభుత్వ ముందుంచాయి. చాలాకాలంగా ఈ అంశాలపై విజ్ఞప్తులు చేస్తున్నప్పటికీ ఆశించిన స్థాయిలో నిర్ణయాలు వెలువడలేదని సంఘాలు పేర్కొంటున్నాయి. జేఏసీ సెప్టెంబర్ 1న జిల్లా కలెక్టరేట్ల వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసనలు, సెప్టెంబర్ 10న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని ప్రకటించడం సమస్య తీవ్రతను సూచిస్తోంది. టీఎన్‌జీవో, టీజీవో, యూటీఎఫ్, టీపీటీఎఫ్, ట్రెసా, ఎస్టీయూ తదితర ప్రధాన ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ఒకే వేదికపైకి రావడం ఉద్యమానికి విస్తృత మద్దతు లభించినట్లు తెలియజేస్తోంది. ప్రభుత్వం ఈ సంకేతాలను ఘర్షణగా కాకుండా, చర్చలకు అవకాశంగా స్వీకరిస్తే పరిపాలనకు మేలు జరుగుతుంది.

పెన్షన్ విధానంపై చర్చ..

దేశంలోని కొన్ని రాష్ట్రాలు ఓల్డ్ పెన్షన్ స్కీమ్‌ను పునరుద్ధరించిన నేపథ్యంలో తెలంగాణలో కూడా సీపీఎస్ స్థానంలో ఓపీఎస్ అమలు చేయాలన్న డిమాండ్ బలంగా వినిపిస్తోంది. ఈ సందర్భంగా ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో ప్రభుత్వ ఉద్యోగులకు ఓల్డ్ పెన్షన్ స్కీమ్ అమలు చేస్తామని ఇచ్చిన హామీల అమలుపై ఉద్యోగులు ఆశలు పెట్టుకోవడం సహజమే. ఈ అంశం కేవలం ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించినది మాత్రమే కాదు, ఎన్నికల హామీల అమలుపై రాష్ట్ర ప్రభుత్వ చిత్తశుద్ధిని, నిబద్ధతను ప్రతిబింబించే కీలక అంశం కూడా. అందువల్ల అన్ని కోణాలను పరిశీలించి స్పష్టమైన నిర్ణయం తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది.

ఓయూ సమస్యకు ప్రత్యేక ప్రాధాన్యత!

ఉస్మానియా విశ్వవిద్యాలయం సీపీఎస్ అంశం కూడా ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు ఓపీఎస్ కోరుతుండగా, 2002 తర్వాత నియమితులైన ఉస్మానియా విశ్వవిద్యాలయ ఉద్యోగులు, అధ్యాపకులు ఇప్పటికీ సాధారణ సీపీఎస్ పరిధిలో లేక ఎల్ఐసీ-లింక్డ్ పెన్షన్ విధానంలో కొనసాగుతున్నారు. దసరా సందర్భంగా ముఖ్యమంత్రి ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని సందర్శించే అవకాశం ఉన్న నేపథ్యంలో, ఆ పర్యటనకు ముందే సీపీఎస్ ఫైల్‌పై నిర్ణయం వెలువడుతుందనే ఆశ ఉద్యోగులు, అధ్యాపకుల్లో ఉంది. ఈ అంశంపై సకాలంలో నిర్ణయం తీసుకుంటే ఉద్యోగుల్లో నెలకొన్న అనిశ్చితి తొలగడమే కాకుండా ప్రభుత్వంపై వారి విశ్వాసం మరింత బలోపేతం అవుతుంది.

ప్రభుత్వం- ఉద్యోగులు విరోధులు కాదు..


ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు పరస్పర విరోధులు కాదు. ప్రజాపాలనలో ఒకే లక్ష్యాన్ని సాధించే భాగస్వాములు. ఉద్యోగుల సంక్షేమం, ప్రజల ప్రయోజనం, ప్రభుత్వ ఆర్థిక సామర్థ్యం-ఈ మూడు అంశాల మధ్య సమతుల్యతను పాటిస్తూ నిర్ణయాలు తీసుకోవడం సుస్థిర పరిపాలనకు అవసరం. పరస్పర విశ్వాసం, నిర్మాణాత్మక సంభాషణ, ఆచరణ సాధ్యమైన నిర్ణయాల ద్వారానే ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. ప్రజాపాలన బలోపేతం కావాలంటే ప్రభుత్వం బలంగా ఉండాలి. ఆ ప్రభుత్వానికి వెన్నెముకైన ప్రభుత్వ ఉద్యోగుల విశ్వాసం, నిబద్ధత, భాగస్వామ్యం కూడా అంతే దృఢంగా నిలవాలి.

# వైసీపీది ఉగ్ర రాజకీయం..టీడీపీ లీడర్‌షిప్ కాన్‌క్లేవ్.. పార్టీ శ్రేణులకు చంద్రబాబు దిశానిర్దేశం

విజయవాడ, రాష్ట్రంలోని పోలవరం సహా అన్ని సాగునీటి ప్రాజెక్టులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, ప్రతి ఎకరాకు నీరు అందించి తెలుగుతల్లికి జలహారతి పట్టడమే తన లక్ష్యమని ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. సాగునీటి రంగంపై తాను చేస్తున్న కృషిని గుర్తిస్తూ ప్రతిష్టాత్మక 'ఎకనామిక్ టైమ్స్' పత్రిక తనను 'వాటర్ మ్యాన్'గా అభివర్ణించడం సంతోషంగా ఉందని అన్నారు. అమరావతిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రెండు రోజుల 'లీడర్‌షిప్ కాన్‌క్లేవ్'లో ఆయన పార్టీ నేతలను ఉద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా సాగునీటి రంగంపై చంద్రబాబు చేస్తున్న కృషిని ప్రశంసిస్తూ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అభినందన తీర్మానం ప్రవేశపెట్టారు. ఉమ్మడి రాష్ట్రంలో ఐటీతో యువతకు ఉపాధి కల్పించిన చంద్రబాబు, ఇప్పుడు జల సంరక్షణతో 'వాటర్ మ్యాన్'గా మారారని కొనియాడారు. పట్టిసీమ, హంద్రీనీవా, వెలిగొండ, పోలవరం వంటి ప్రాజెక్టుల ద్వారా రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి సీఎం బాటలు వేస్తున్నారని ఎకనామిక్ టైమ్స్ కథనాన్ని ఆయన ఉటంకించారు. వచ్చే మూడేళ్లలో రూ.35 వేల కోట్లతో 36 ప్రాజెక్టులను పూర్తి చేసే లక్ష్యాన్ని కూడా ఆ పత్రిక ప్రశంసించిందని తెలిపారు. ఈ ప్రశంసల నేపథ్యంలో పార్టీ నేతలంతా ఏకతాటిపై నిలబడి చంద్రబాబుకు స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చి అభినందనలు తెలిపారు.

కార్యకర్తలే పార్టీకి బలం.. కూటమి ఐక్యత ముఖ్యం

పొలిటికల్ గవర్నెన్స్‌కు ప్రాధాన్యత ఇస్తూ పాలనలో ముందుకు సాగుతున్నామని చంద్రబాబు తెలిపారు. కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన కార్యకర్తలకు పూర్తి గౌరవం ఇస్తామని, అనంతపురం జిల్లాకు చెందిన దళవాయి రమాదేవికి పదవి ఇవ్వడమే దీనికి నిదర్శనమని అన్నారు. క్షేత్రస్థాయిలో సమర్థంగా పనిచేసే వారికే పార్టీలో, చట్టసభల్లో అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. "పార్టీ బలోపేతం ఎంత ముఖ్యమో, కూటమి ఐక్యత కూడా అంతే ముఖ్యం. ఫ్లెక్సీలు, ఫోటోల కోసం వివాదాలకు తావివ్వకుండా కలిసికట్టుగా పనిచేయాలి. 2024 కంటే 2029లో మరింత మెరుగైన ఫలితాలు సాధించాలి," అని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారుగత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని వెంటిలేటర్‌పై పెట్టి, వ్యవస్థలను విధ్వంసం చేసిందని చంద్రబాబు విమర్శించారు. పాలకుడు ఎలా ఉండకూడదో చెప్పడానికి గత పాలనే ఒక కేస్ స్టడీ అని వ్యాఖ్యానించారు. "వైసీపీ ఒక గొడ్డలి పార్టీ. ఉగ్రవాదుల తరహాలో హిట్-రన్-హైడ్ అనే విధానంతో రాజకీయాలు చేస్తోంది. వారి ఫేక్ ప్రచారాన్ని తేలిగ్గా తీసుకోవద్దు. ప్రతి ఆరోపణను వాస్తవాలతో (ఫ్యాక్ట్) గట్టిగా తిప్పికొట్టాలి. సోషల్ మీడియాలో చురుగ్గా ఉంటూ ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి," అని నేతలకు దిశానిర్దేశం చేశారు. వెలిగొండ, పోలవరం ఎడమ కాలువ విషయంలో వైసీపీ వక్రీకరణలకు పాల్పడుతోందని, వాటిని ఎండగట్టాలని సూచించారు.కేంద్ర సహకారంతో అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలనను సమన్వయం చేసుకుంటూ



ముందుకు వెళ్తున్నామని చంద్రబాబు వివరించారు. నెలకు రూ.73 వేల కోట్లతో 63 లక్షల మందికి పైగా పెన్షన్లు అందిస్తున్నామని, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, అన్న క్యాంటీన్లు వంటి పథకాలను పునరుద్ధరించామని తెలిపారు. మెగా డీఎస్సీ ద్వారా నియామకాలు చేపట్టామని, మూడు ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేశామని అన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టు, రాయలసీమలో పరిశ్రమలు, అమరావతిలో క్వాంటం టెక్నాలజీ హబ్ ఏర్పాటుతో రాష్ట్రాన్ని సర్వతోముఖాభివృద్ధి దిశగా నడిపిస్తున్నామని వివరించారు. రాజముద్ర, బ్లాక్‌చెయిన్ టెక్నాలజీతో భూములకు భద్రత కల్పిస్తూ దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరిస్తున్నామని చంద్రబాబు పేర్కొన్నారు.

రెండు రోజుల పాటు ట్రైనింగ్

టీడీపీ కేంద్ర కార్యాలయంలో రెండు రోజుల లీడర్‌షిప్ కాంక్లేవ్ సోమవారం ప్రారంభమైంది. ముఖ్యమంత్రి, పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, మంత్రులు, పొలిట్ బ్యూరో సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ముఖ్య నేతలు ఈ సమావేశానికి హాజరయ్యారు. రాజకీయాల్లో సరికొత్త ఒరవడికి శ్రీకారం చుడుతూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. సమావేశం ప్రారంభానికి ముందు వేదికపై ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి చంద్రబాబు, ఇతర నేతలు నివాళులర్పించారు.ఈ కాంక్లేవ్‌లో భాగంగా మొత్తం 10 కీలక అంశాలపై చర్చించనున్నారు. ముఖ్యంగా ప్రభుత్వం-పార్టీ మధ్య సమన్వయం, అందుబాటులో ఉన్న వనరుల సమర్థ వినియోగం, త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం కావడం, ఎల్ నినో ప్రభావం వంటి అంశాలపై నేతలు సమాలోచనలు జరుపుతున్నారు.అంతేకాకుండా క్షేత్రస్థాయిలో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరుపై ప్రజాప్రతినిధుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోనున్నారు. పథకాల అమలులో ఎదురవుతున్న సవాళు,, వాటిని అధిగమించే మార్గాలపై ఈ రెండు రోజుల సమావేశంలో విస్తృతంగా చర్చించి కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. పార్టీని, ప్రభుత్వాన్ని మరింత బలోపేతం చేయడమే ఈ కాంక్లేవ్ ప్రధాన ఉద్దేశం.

# మంచి జీవితం అంటూ వ్యభిచారం...

గుంటూరు, గుంటూరు నగరంలోని పాత గుంటూరు పోలీస్ స్టేషన్ పరిధిలో మైనర్ బాలికను మాయమాటలతో వలలోకి దించి వ్యభిచారంలోకి దించిన ఘటన వెలుగులోకి వచ్చింది. బాలికను వేధిస్తున్న మహిళతో పాటు మరో మహిళ, ముగ్గురు యువకుల ప్రమేయం ఉన్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారునగరంలోని ఓ ప్రభుత్వ కాలేజీలో ఇంటర్ చదువుతున్న బాలిక తల్లిదండ్రులు కొంతకాలంగా విడివిడిగా ఉంటున్నారు. తండ్రి గుంటూరులో ఉండగా.. తల్లి ప్రకాశం జిల్లాలో ఉంటున్నారు. దీంతో బాలిక బాలాజీనగర్‌లో నివసించే తన బాబాయి ఇంటికి తరచూ వచ్చి వెళ్తుండేది. ఈ క్రమంలో బాలికకు పావని అనే మహిళ పరిచయమైంది. బాలికకు అవసరమైన డబ్బులు ఇస్తానని, మంచి జీవితం చూపిస్తానని నమ్మించింది. ఆమె మాటలను నమ్మిన బాలిక క్రమంగా పావని చెప్పినట్లు వినడం ప్రారంభించింది. ఆ తర్వాత బాలికను వ్యభిచారంలోకి దించినట్లు ఆరోపణలు ఉన్నాయి. గుంటూరు నగరంతో పాటు ఇతర ప్రాంతాలకు కూడా బాలికను తీసుకెళ్లి లైంగిక దోపిడీకి గురిచేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.కొంతకాలంగా బాలిక పావని చెప్పినట్లు వినకపోవడంతో ఆమె వేధింపులకు గురిచేసినట్లు తెలుస్తోంది. వేధింపులు తాళలేక బాలిక ఈ విషయాన్ని తన తండ్రికి చెప్పింది. దీంతో ఆందోళనకు గురైన తండ్రి వెంటనే బాలికను తీసుకుని పాత గుంటూరు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు వెంటనే కేసు నమోదు చేసి పావనిని అదుపులోకి తీసుకున్నారు. దర్యాప్తులో భాగంగా మరిన్ని వివరాలు సేకరించగా.. బాలికను వ్యభిచారంలోకి దించేందుకు మరో మహిళతో పాటు ముగ్గురు యువకులు కూడా సహకరించినట్లు పోలీసులు గుర్తించారు. వారిని కూడా అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

ముఠా కార్యకలాపాలపై ఆరా

ఈ వ్యవహారం వెనుక పెద్ద ముఠా ఉందా? ఎంతకాలంగా ఈ తరహా కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు? మరెంత మంది బాలికలు లేదా మహిళలు బాధితులుగా ఉన్నారు? మహిళల అక్రమ రవాణాకు కూడా ఈ ముఠాకు సంబంధాలున్నాయా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.బాలికను రక్షించి హోంకు తరలించిన పోలీసులు.. ఆమె నుంచి స్టేట్‌మెంట్ తీసుకునే ప్రక్రియ కొనసాగిస్తున్నారు.

# పీఎం రేసులోకి కొత్త పేర్లు

చెన్నై, భారత జాతీయ రాజకీయం ఎప్పుడు ఏ మలుపు తిరుగుతుందో ఊహించడం కష్టం. 2029 సార్వత్రిక ఎన్నికలకు సమయం ఉన్నప్పటికీ, ప్రధానమంత్రి రేసు చుట్టూ ఇప్పుడే ఆసక్తికరమైన చర్చ మొదలైంది. కాంగ్రెస్ పార్టీకి జాతీయ స్థాయిలో రాహుల్ గాంధీ స్పష్టమైన ప్రధాని ముఖచిత్రం అనడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే, కాంగ్రెస్‌కు ఏకపక్షంగా సొంత బలం దక్కక, ప్రాంతీయ మిత్రపక్షాల మద్దతుతోనే కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి వస్తే మాత్రం ప్రధానమంత్రి అభ్యర్థిత్వం అతిపెద్ద చిక్కుముడిగా మారుతుంది. గత చరిత్రను గమనిస్తే, సమాజ్‌వాదీ పార్టీ, తృణమూల్ కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ వంటి బలమైన ప్రాంతీయ పార్టీలు రాహుల్ గాంధీ నాయకత్వాన్ని ఏకగ్రీవంగా అంగీకరించడంలో ఎప్పుడూ సంకోచిస్తూనే ఉన్నాయి.ఇలాంటి పరిస్థితుల్లోనే మిత్రపక్షాలకు అందరికీ ఆమోదయోగ్యమైన ఒక సర్వసమ్మత నాయకుడి అన్వేషణ ప్రారంభమవుతుంది. భారత ప్రజాస్వామ్య చరిత్రలో 1996లో హెచ్.డి. దేవేగౌడ, ఐ.కె. గుజ్రాల్ వంటి నాయకులు అనూహ్యంగా ప్రధాని పీఠాన్ని అధిరోహించిన సందర్భాలు ఉన్నాయి. సరిగ్గా ఈ సమీకరణాల్లోనే, తమిళనాడు ముఖ్యమంత్రి , తమిళగ వెట్రి కజగం అధినేత జోసెఫ్ విజయ్ పేరు జాతీయ స్థాయిలో చర్చకు వస్తోంది. సంకీర్ణ రాజకీయాల్లో విపక్ష ప్రాంతీయ పార్టీలు తమ కంటే బలమైన జాతీయ నేతను ప్రధానిగా అంగీకరించడానికి ఇష్టపడవు. అక్కడ వివాదరహితుడు, అందరికీ సర్దుబాటు అయ్యే కొత్త ముఖానికే ఎక్కువ అవకాశాలు ఉంటాయి. ఇటీవల వెలువడిన సర్వేలో ప్రధాని రేసులో నరేంద్ర మోదీ, రాహుల్ గాంధీ తదుపరి స్థానంలో అనూహ్యంగా విజయ్ మూడో స్థానంలో నిలిచారు. ఇది టీవీకే శ్రేణుల్లోనే కాకుండా జాతీయంగా చర్చనీయాంశమైంది.తమిళనాడులోని టీవీకే మంత్రులు, సీనియర్ నేతలు విజయ్ కేవలం తమిళనాడుకే పరిమితం కాదని, ఉత్తరాది ప్రజలు కూడా ఆయన వైపే చూస్తున్నారని వ్యాఖ్యానించడం కాంగ్రెస్-టీవీకే కూటమిలో విబేధాలకు దారితీసింది. విజయ్‌కి ఏ జాతీయ పార్టీతోనూ దీర్ఘకాల శత్రుత్వం లేదు. దక్షిణాదికి చెందిన ప్రజాదరణ పొందిన నాయకుడు కావడం, సిద్ధాంతపరమైన తీవ్రమైన మరకలు లేకపోవడం వల్ల ప్రాంతీయ పార్టీల అధినేతలకు రాహుల్ కంటే విజయ్‌ను ప్రధాని అభ్యర్థిగా మద్దతు ఇవ్వడం సులువుగా మారవచ్చు.విజయ్‌ని ప్రధాని అభ్యర్థిగా ప్రాజెక్ట్ చేయడంపై కాంగ్రెస్ తీవ్రంగా స్పందిస్తోంది. తమిళనాడు కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మాణికం ఠాగూర్ దీనిని టీవీకే నేతల ఫ్యాన్ క్లబ్ మానసిక స్థితి గా అభివర్ణించడమే కాక, 2029లో రాహుల్‌ను ప్రధానిగా అంగీకరించకపోతే తమిళనాడు కేబినెట్ నుంచి కాంగ్రెస్ మంత్రులు తప్పుకుంటారని హెచ్చరించే స్థాయికి విభేదాలు వెళ్లాయి. అయినప్పటికీ, ఎన్నికల అనంతర సమీకరణాల్లో సీట్ల సంఖ్యే కీలక పాత్ర పోషిస్తుంది. భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయాలు ఎప్పుడూ ఒకే లైన్‌లో సాగవు. కేంద్రంలో అధికార పీఠాన్ని దక్కించుకోవడంలో కాంగ్రెస్ సంఖ్యాబలం తగ్గి, రాహుల్ గాంధీ పేరుపై మిత్రపక్షాల మధ్య అంగీకారం కుదరకపోతే.. ప్రత్యామ్నాయంగా దక్షిణాది నుంచి విజయ్ లాంటి పాపులర్ మాస్ లీడర్ ఎదిగే అవకాశాలను ఏమాత్రం కొట్టిపారేయలేం.

# మెగా డీఎస్సీపై.... ఓపెన్ డిబేట్ సాధ్యమా

విజయవాడ,ఆంధ్రప్రదేశ్‌లో మెగా డీఎస్సీ ఉపాధ్యాయ నియామకాల చుట్టూ ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ నడుపుతున్న రాజకీయ డ్రామా రోజురోజుకూ తన విశ్వసనీయతను కోల్పోతోంది. నియామక ప్రక్రియలో అక్రమాలు జరిగాయంటూ సామాజిక మాధ్యమాల్లో బురద చల్లడం, ప్రెస్ మీట్లలో వ్యాఖ్యలు చేసి వెళ్లిపోవడం కాకుండా.. ధైర్యముంటే బహిరంగ చర్చకు రావాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విసిరిన సవాల్‌పై వైసీపీ నోరు మెదపకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఆధారాలుంటే ప్రజల ముందు పెట్టాలి తప్ప, తెరవెనుక దాక్కుని రాళ్లేయడం, ముసుగు సంస్థలతో తప్పుడు ప్రచారాలు చేయించడం, రాజకీయ ప్రయోజనాల కోసం సీబీఐ విచారణ కోరడం రాజకీయం కాదు. అసలు సీబీఐకి అప్పగించిన ఏ కేసును ఆ సంస్థ ఎంత త్వరగా పూర్తి చేసిందో వైసీపీ స్పష్టం చేయగలదా? మాజీ ఎంపీ వివేకానందరెడ్డి హత్య కేసు విచారణే ఏళ్ల తరబడి కొలిక్కిరాకుండా సాగుతుంటే, ఉపాధ్యాయ నియామకాలను సీబీఐకి ఇవ్వాలనడం పదహారు వేల మంది టీచర్ల కుటుంబాలపై కుట్రలు చేయడమే.ప్రజాస్వామ్యంలో ఏ విషయమైనా తేలాల్సింది ప్రజల సమక్షంలో, చట్టసభల ప్రాంగణంలో! విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అసెంబ్లీ లోపలైనా, బయటైనా, సమయం-వేదిక జగన్ రెడ్డి ఇష్టానికే వదిలేస్తూ పాయింట్ టు పాయింట్ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. 16,347 ఉపాధ్యాయ పోస్టులను రికార్డు స్థాయిలో 148 రోజుల్లో అత్యంత పారదర్శకంగా, టీసీఎస్ ప్లాట్‌ఫారమ్ ద్వారా, సుప్రీంకోర్టు రిజర్వేషన్ నిబంధనలకు కట్టుబడి భర్తీ చేశామని ప్రభుత్వం ఆధారాలతో సహా వివరణ ఇచ్చింది.141 రకాల కోర్టు కేసులతో నియామకాలను నిలిపివేసేందుకు ప్రయత్నించినా, న్యాయస్థానాలు వాటిని కొట్టివేస్తూ నోటిఫికేషన్‌లోని పారదర్శకతను సమర్థించాయి. ఇన్ని వాస్తవాలు కళ్లముందు కనిపిస్తుంటే, నాకు నేను చాలు అంటూ వైసీపీకి చెందిన ద్వితీయ శ్రేణి నేతలతో కవర్ డ్రైవ్‌లు వేయించడం జగన్ రెడ్డికి రాజకీయంగా మారింది. .నేరుగా లోకేష్ రాజీనామాను డిమాండ్ చేస్తున్నది జగన్ మోహన్ రెడ్డి అయినప్పుడు, ఆయనే స్వయంగా వచ్చి చర్చకు కూర్చోవాల్సిన బాధ్యత ఉంది. విద్యాశాఖ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ప్రతి అంశంలోనూ పారదర్శకత పాటిస్తున్నామని మంత్రి లోకేష్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అసెంబ్లీలో డేటాను సమర్పించారు. మరి వైసీపీ వద్ద నిజంగానే డీఎస్సీ ప్రక్రియలో లోపాలు ఉన్నాయనడానికి ఆధారాలు ఉంటే, వాటిని మంత్రి ముందే బహిర్గతం చేసి ప్రజలకు ఎందుకు నిజాలు తెలియజేయకూడదు? బెయిల్ నిబంధనలు లేదా విచారణల సాకు చూపి చట్టసభలకు రాకుండా తప్పించుకోవడం ద్వారా తాము చేస్తున్న ఆరోపణలు కేవలం రాజకీయ బురదచల్లుడు చర్యలేనని జగన్ స్వయంగా అంగీకరించినట్లవుతోంది.రోజుకో డ్రామా ఆడటం, ఆధారం లేని ఆరోపణలు చేసి పారిపోవడం వల్ల ప్రతిపక్షానికే నష్టం. గత ఐదేళ్ల తమ హయాంలో ఒక్క డీఎస్సీని కూడా నిర్వహించలేక, దాదాపు 12 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రైవేట్ బడులకు వెళ్లేలా విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసిన చరిత్ర వైసీపీది. అటువంటిది కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి మొదటి సంతకంతో మెగా డీఎస్సీని పూర్తి చేసి వేలాది నిరుద్యోగ యువతకు నియామక పత్రాలు అందిస్తే ఉద్యోగం రాని వారిని రెచ్చగొట్టేందుకు కుట్రలకు పాల్పడుతున్నారు. ఇప్పటికైనా మించిపోయిందేమీ లేదు. నిరుద్యోగ యువత భవిష్యత్తు , విద్యార్హతల ఆధారంగా జరిగిన మెగా డీఎస్సీపై ఉన్న సందేహాలను నివృత్తి చేసుకోవడానికి జగన్ రెడ్డికి మంచి అవకాశం ఉంది. మీడియా ముందు హాఫ్ ట్రూత్స్ మాట్లాడటం, బాధ్యతారాహిత్యంగా రాజీనామాలు కోరడం మాని, లోకేష్ విసిరిన సవాల్‌ను స్వీకరించి ముఖాముఖి చర్చకు రావాలి. ఆధారం లేని బురద చల్లే రాజకీయాలకు ముగింపు పలికి, ప్రజల సమక్షంలో నిజానిజాలు తేల్చుకోవడమే ప్రజాస్వామ్య పద్ధతి!పారిపోవడం వీరత్వం అనిపించుకోదు; నిజాయితీ ఉంటే జగన్ రెడ్డి చర్చల వేదికపై అడుగుపెట్టాల్సిందే.

# వడివడిగా లోకల్ బాడీ ఎన్నికల ఏర్పాట్లు

విజయవాడ, ఏపీ రాష్ట్రంలో స్థానిక ఎన్నికలు నిర్వహించడానికి రంగం సిద్ధం చేసింది. ఈ నేపథ్యంలో రిజర్వేషన్లు.. ఓటర్ల జాబితా.. ఇతర వ్యవహారాలను ఎన్నికల సంఘం అధికారులు పర్యవేక్షిస్తున్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో స్థానిక ఎన్నికలవేళ ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. అధికారులకు ఆయన కీలక ఆదేశాలు కూడా జారీ చేశారు. దీంతో చాలామందికి పదవులు రాబోతున్నాయి. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రజల అభిప్రాయంతో సంబంధం లేకుండా ఇష్టానుసారంగా జిల్లాలు ఏర్పాటు చేశారు. అంతటితోనే ఆగిపోయారు. శాశ్వతమైన నిర్మాణాలు.. బలమైన కార్య నిర్వాహక వ్యవస్థ.. కొత్త పదవుల భర్తీ వంటివి చేయలేకపోయారు .జగన్ చేయలేక పోయిన పనిని ఇప్పుడు చంద్రబాబు చేస్తున్నారు. ఏపీ రాష్ట్రంలో ప్రస్తుతం 13 జెడ్పీలు మాత్రమే ఉన్నాయి. వీటిని 28 చేయాలని ఇటీవల చంద్రబాబు నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. చంద్రబాబు నిర్ణయం మేరకు అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. జగన్ పరిపాలన కాలంలో మార్కాపురం.. పోలవరం జిల్లాలకు కూడా కూటమి ప్రభుత్వం జడ్పీలను ఏర్పాటు చేసింది. అంతేకాదు కొత్త జిల్లా పరిషత్తుల నిర్వహణ కోసం ఏకంగా 30 కీలకమైన పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం భావిస్తుంది. దీనికి తోడు అదనంగా 15 జడ్పీ సీఈవో.. 15 డిప్యూటీ సీఈవో పోస్టుల భర్తీకి ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. సెప్టెంబర్ 24 తో ప్రస్తుతం కొనసాగుతున్న జెడ్పి పాలకవర్గాల పదవీకాలం పూర్తవుతుంది. ఇది పూర్తి అయిన వెంటనే 28 కొత్త జడ్పీ ల వ్యవస్థ అందుబాటులోకి వస్తుంది. అంతేకాదు ముఖ్యమంత్రి నిర్ణయం మేరకు 660 మండలాలను కొత్త జిల్లా పరిషత్ పరిధిలోకి మ్యాపింగ్ చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు.జెడ్పిల పనితీరు విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అత్యంత ముందు చూపుతో ఉన్నారు. వివాదాస్పద.. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు కాకుండా కొత్త జడ్పీ లకు ప్రస్తుతం ఉన్న పారదర్శకమైన సిబ్బందిని ప్రభుత్వం సర్దుబాటు చేయనుంది. పురపాలక ఎన్నికలు పూర్తి కాకముందే జిల్లా పరిషత్ లకు సంబంధించిన పునర్విభజన ప్రక్రియను పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు. దీంతో కొత్త జిల్లాలవాసులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు ముఖ్యమంత్రి నిర్ణయంతో పరిష్కారం కాబోతున్నాయి. ఆశావాహుకులకు కొత్తగా పదవులు కూడా దక్కబోతున్నాయి. స్థానిక ఎన్నికల నేపథ్యంలో రాజకీయ ముఖచిత్రం కూడా మారనుంది.


# కులాల చుట్టే పోలరైజేషన్...

కాకినాడ,ఆంధ్రప్రదేశ్ రాజకీయాలను పరిశీలిస్తే కుల సమీకరణాలు ఇప్పటికీ కీలక పాత్ర పోషిస్తున్నాయనే అభిప్రాయం ఉంది. అయితే గతంతో పోలిస్తే ఇప్పుడు ఈ ప్రభావం మరో రూపంలో కనిపిస్తోంది. ముఖ్యంగా యువతలో రాజకీయ ఆసక్తి పెరగడం ఒకవైపు సానుకూల పరిణామంగా కనిపిస్తున్నప్పటికీ, సామాజిక వర్గాల ఆధారంగా వారు విడిపోతున్న తీరు మాత్రం చర్చకు దారితీస్తోంది.గతంలో కులం, రాజకీయాల విషయంలో పెద్దల మధ్య ఎక్కువగా చర్చలు జరిగేవి. యువత మాత్రం వాటికి కొంత దూరంగా ఉండేది. తమ చదువు, ఉద్యోగం, వ్యక్తిగత భవిష్యత్తుపైనే ఎక్కువగా దృష్టి పెట్టేది. కానీ సామాజిక మాధ్యమాలు విస్తరించిన తర్వాత పరిస్థితిలో మార్పు వచ్చింది. రాజకీయ నాయకుల ప్రసంగాలు, అభిమాన సంఘాల కార్యక్రమాలు, సోషల్ మీడియా పోస్టులు నేరుగా యువతను ప్రభావితం చేస్తున్నాయి. దీంతో తమకు నచ్చిన పార్టీ లేదా నాయకుడి పట్ల కొందరు యువకులు తీవ్ర అభిమానాన్ని ప్రదర్శిస్తున్నారు.రాజకీయ చైతన్యం పెరగడం ప్రజాస్వామ్యానికి మంచిదే. యువత విధానాలను ప్రశ్నించడం, ప్రభుత్వ పనితీరుపై చర్చించడం, తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేయడం ఆరోగ్యకరమైన పరిణామాలే. కానీ రాజకీయ అభిమానం సామాజిక వర్గ గుర్తింపుతో కలిసిపోయినప్పుడు పరిస్థితి మరో విధంగా మారే అవకాశం ఉంటుంది. ఒక నాయకుడిని ఆయన విధానాల కోసం కాకుండా తమ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిగా మాత్రమే చూడటం రాజకీయ చర్చను సంకుచితం చేస్తుంది.ఇటీవల ఒక ప్రముఖ రాజకీయ నాయకుడి జన్మదిన వేడుకల సందర్భంగా కొన్ని ప్రాంతాల్లో యువత పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహించడం ఈ చర్చకు మరింత బలం ఇచ్చింది. బైక్ ర్యాలీలు, భారీ సంబరాలు, ప్రత్యేక కార్యక్రమాలతో అభిమానాన్ని చాటుకున్నారు. చదువుకునే ప్రదేశాలు, పనిచేసే చోట్ల కూడా ఒకే సామాజిక నేపథ్యానికి చెందిన వారు సమూహంగా ఏర్పడి వేడుకలు నిర్వహించిన సందర్భాలు కనిపించాయి. సహజమైన అభిమానాన్ని మించి భావోద్వేగం కనిపించడం రాజకీయ పరిశీలకుల దృష్టిని ఆకర్షించింది.ఒక నాయకుడిపై అభిమానం ఉండటం తప్పు కాదు. అదే అభిమానం ఇతర పార్టీలను లేదా సామాజిక వర్గాలను తక్కువగా చూడటానికి దారితీయకూడదు. సోషల్ మీడియాలో భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసిన వారిపై దూషణలు చేయడం, రాజకీయ ప్రత్యర్థులను శత్రువులుగా భావించడం వంటి ధోరణులు యువతలో పెరగడం మాత్రం ఆందోళన కలిగించే అంశమే. ప్రజాస్వామ్యంలో అభిప్రాయ భేదాలు సహజం. వాటిని గౌరవించడం కూడా రాజకీయ సంస్కృతిలో భాగమే.ఇక యువత ఒక నిర్దిష్ట సామాజిక వర్గం చుట్టూ రాజకీయంగా సమీకృతమైతే భవిష్యత్ ఎన్నికల్లో దాని ప్రభావం ఎలా ఉంటుంది అనేది ఆసక్తికరంగా మారింది. రాజకీయ పార్టీలు కూడా యువత మద్దతును తమకు అనుకూలంగా మార్చుకునేందుకు ప్రయత్నించే అవకాశం ఉంది. అయితే యువతను కులం, ప్రాంతం లేదా వ్యక్తిగత అభిమానాలకు పరిమితం చేయకుండా విధానాలు, అభివృద్ధి, ఉపాధి, విద్య వంటి అంశాలపై ఆలోచించేలా చేయడం అవసరం. అప్పుడే యువ రాజకీయ చైతన్యం సమాజానికి బలంగా మారుతుంది.

# నర్సు హత్య ఘటనపై మేజిస్టీరియల్ విచారణ

హైదరాబాద్,ఇటీవల హైదరాబాద్ శివార్లలోని తుక్కుగూడలో ప్రైవేట్ హాస్పిటల్ లో నర్సు హత్యాచారానికి గురైన ఘటనను ముఖ్యమంత్రి ఎ. రేవంత్రెడ్డి తీవ్రంగా పరిగణించారు. ఈ ఘటనకు సంబంధించిన అన్ని అంశాలపై సమగ్రంగా మేజిస్టీరియల్ విచారణ జరిపించాలని అధికారులను ఆదేశించారు. ఘటనకు దారితీసిన పరిస్థితులు, బాధితురాలు ఉంటున్న వసతి ప్రదేశంలో భద్రతా ఏర్పాట్లు, సంబంధిత సంస్థ నిర్వహణలో ఏవైనా నిర్లక్ష్యాలు ఉన్నాయా, మహిళా ఉద్యోగుల భద్రత విషయంలో పాటించాల్సిన నిబంధనలు అమలయ్యాయా అనే అంశాలన్నింటినీ విచారణలో పరిశీలించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ కేసులో ఇప్పటికే నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్న నేపథ్యంలో దర్యాప్తును అత్యంత పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు. దర్యాప్తు, ఫోరెన్సిక్ నివేదికలు, ఇతర సాంకేతిక ఆధారాల సేకరణను వీలైనంత వేగంగా పూర్తి చేసి సమగ్ర ఛార్జిషీట్ దాఖలు చేసేలా పోలీసు ఉన్నతాధికారులు కేసును నిరంతరం పర్యవేక్షించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.ఈ కేసులో బాధిత కుటుంబానికి సత్వర న్యాయం అందేలా ఫాస్ట్రాక్ కోర్టు ద్వారా విచారణ చేపట్టేందుకు అవసరమైన చర్యలను ప్రారంభించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.న్యాయశాఖ, పోలీసు శాఖ, ప్రాసిక్యూషన్ విభాగాలు సమన్వయంతో పనిచేసి కేసు విచారణలో జాప్యం లేకుండా చూడాలని సూచించారు.బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇప్పటికే ప్రభుత్వం తరపున మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి,

# ఆ రెండు వర్గాలకే అధికారమా



విజయవాడ,మాజీ రాజ్యసభ సభ్యుడు వి. విజయసాయి రెడ్డి విజయవాడ వేదికగా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ప్రత్యామ్నాయ శక్తిగా నూతన రాజకీయం తేవాల్సిన అవసరం ఉందన్న ఆయన, తాను స్థాపించబోయే కొత్త పార్టీలో తాను కాదని స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని ఎల్లప్పుడూ కమ్మ, రెడ్డి అనే రెండు కులాలే పాలించాలా అని ప్రశ్నించిన సాయిరెడ్డి, సమర్థత కలిగిన ఎవరైనా సీఎం కాగలరని పేర్కొన్నారు. మహారాష్ట్ర రాజకీయంలో శివసేన వ్యవస్థాపకుడు బాల్ థాకరే వహించిన తరహా మెంటార్ పాత్రను తాను పోషిస్తానని వెల్లడించారు. తాను రాజధాని అమరావతికి వ్యతిరేకం కాదని, ఇంత ఖర్చు పెట్టాక వేరే రాజధాని అనడం కుదరదని పేర్కొన్నారు. తన పార్టీలో జెన్ జీ కి పెద్ద పీట వేస్తామని, వారికే 66 శాతం సీట్లు కేటాయిస్తామని ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ప్రస్తుతం 2 ప్రధాన రాజకీయ పక్షాలు, కుటుంబాలు ఏలుతున్నాయని, ఇతర పార్టీలు ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వంపై పోరాడే పరిస్థితిలో లేవన్నారు. గడిచిన పదేళ్లుగా ఏపీలో టీడీపీ లేదా వైసీపీ అన్నట్లుగా వాతావరణం తయారైందని, ఈ రెండు పార్టీలు ఫ్యాక్షన్ రాజకీయాలు చేస్తున్నాయని మండిపడ్డారు. టీడీపీని 'రెడ్ బుక్ పార్టీ'గా, వైసీపీని రప్పా రప్పా పార్టీగా అభివర్ణించిన ఆయన, వీటి మధ్య జరుగుతున్న రచ్చలో పోలీసులు కూడా అధికారంలో ఉన్న పార్టీ తరపునే వ్యవహరిస్తూ ప్రజలను వేధిస్తున్నారని ఆరోపించారు.ఈ 2 ప్రధాన పార్టీల మధ్య ప్రజలు తీవ్రంగా నలిగిపోతున్నారని, అందుకే మూడో ప్రత్యామ్నాయ పార్టీ అవసరం ఏర్పడిందని విజయసాయి రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రాన్ని ఎలా దోచుకోవాలనే అంశం చుట్టూనే ఆ రెండు పార్టీల దృష్టి ఉందని ధ్వజమెత్తారు. ఇవి కేవలం నిర్దిష్ట కుటుంబాలకు చెందిన పార్టీలని, "ప్రజలకు గోరంత.. తమ కుటుంబాలకు కొండంత" అనేదే వారి నినాదమని దుయ్యబడ్డారు. రాష్ట్రంలో ప్రతి పనికీ రౌడీ మామూళ్లు వసూలు చేసే పరిస్థితి నెలకొందని ఆయన ఆరోపించారు.గత ఏడాది ఒక పుస్తకం రాసా. రెడ్డి సామాజిక వర్గం ఎలా ఉద్భవించింది. మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి ఏపీ రాజకీయాలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. త్వరలో తాను ఏర్పాటు చేయబోయే నూతన రాజకీయ పార్టీ జెండా, అజెండాను ప్రకటించే ముందు, రాష్ట్రంలోని సమస్యలను ప్రజల ముందు ఉంచుతానని స్పష్టం చేశారు. ఏపీకి ఇప్పుడు మూడో ప్రత్యామ్నాయం ఎంతో అవసరమని, ఈ విషయాన్ని ప్రజలకు వివరిస్తానని ఆయన తెలిపారు. విజయవాడలో సోమవారం పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు.ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న వైసీపీ, టీడీపీ, జనసేన పార్టీలకు ప్రజా సమస్యలను పట్టించుకునే పరిస్థితి లేదని విజయసాయిరెడ్డి విమర్శించారు. ముఖ్యంగా రాష్ట్ర రాజకీయం మొత్తం రెండు పార్టీల చుట్టూనే తిరుగుతోందని, వైసీపీ, టీడీపీల మధ్య ఫ్యాక్షన్ తరహా యుద్ధం జరుగుతోందని ఆరోపించారు. ఈ పార్టీలకు పోలీసులు కూడా మద్దతు ఇస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు.టీడీపీ, వైసీపీలు ఫ్యాక్షన్ కుటుంబ రాజకీయ పార్టీలని విజయసాయిరెడ్డి అభివర్ణించారు. ఆరు కోట్ల ప్రజానీకం, రాష్ట్ర సంపదను ఏ పార్టీ దోచుకోవాలనే హక్కు కోసం ఈ రెండు పార్టీలు పోటీ పడుతున్నాయని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు. "ప్రజలకు గోరంత, తమకు కొండంత" అన్నట్లుగా ఈ పార్టీల తీరు ఉందని, అందుకే రాష్ట్రానికి మరో రాజకీయ ప్రత్యామ్నాయం అవసరమని ఆయన నొక్కి చెప్పారు.

# 'పొలిటికల్ చౌరస్తా'లో కొండా ఫ్యామిలీ.. కొత్త పార్టీ పెడతారా?

హైదరాబాద్,పార్టీ ఏదైనా నిత్య అసమ్మతివాదులుగా ముద్రపడిన కొండా ఫ్యామిలీ రాజకీయ భవిష్యత్తు ఒక్కసారిగా ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారిందా? అంటే ఔననే సమాధానం వస్తోంది. రాష్ట్ర దేవాదాయ, పర్యావరణ, అటవీ శాఖ మంత్రిగా కొనసాగిన కొండా సురేఖను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయడంతో కొండా కుటుంబం భవిష్యత్తు నిర్ణయం ఏ విధంగా ఉంటుందనే ఊహాగానాలు, జోరుగా చర్చోపచర్చలు సాగుతున్నాయి. ప్రస్తుతానికి కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్యేగా కొనసాగుతూ తూర్పు నియోజకవర్గ ప్రజలకు సేవ చేస్తానంటూ కొండా సురేఖ మీడియా ముందు వెల్లడించినప్పటికీ, రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతారా? లేదా? అనే అనుమానాలు నలువైపులా వ్యక్తమవుతున్నాయి. మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయడం తీవ్రమైన అవమానంగా భావిస్తున్న కొండా ఫ్యామిలీ కాంగ్రెస్ పార్టీలో తాజాగా నెలకొన్న ప్రతికూల పరిస్థితుల్లో ఆ పార్టీలో కొనసాగడం తీవ్ర ఇబ్బందికరమైన అంశంగా పరిశీలకులు భావిస్తున్నారు. ఇది ఆ కుటుంబానికి అగ్నిపరీక్షగా పేర్కొంటున్నారు. పైగా, ముఖ్యమంత్రి రేవంత్ నుంచి పార్టీ అధిష్ఠానంతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నేతలంతా కొండా కుటుంబం పట్ల వ్యతిరేకంగా ఉన్న నేపథ్యంలో తమ సహజ శైలికి భిన్నంగా పార్టీలో అణిగిమణిగి ఉంటారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. తమ భవిష్యత్ నిర్ణయాన్ని రెండు, మూడు రోజుల్లోనే ప్రకటిస్తామంటూ కొండా సురేఖ ప్రకటించడంలో మతలబేమిటనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తమ భవిష్యత్తు పై ఇప్పటికే నిర్ణయం తీసుకున్నారా? లేక రానున్న రోజుల్లో పరిస్థితులనుబట్టి తీసుకుంటారా? అనే అనేది కీలకంగా మారింది.

పొలిటికల్ చౌరస్తా సెంటర్ లో కొండా ఫ్యామిలీ

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఐదు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచి, రెండు పర్యాయాలు మంత్రిగా పనిచేసిన కొండా సురేఖ, ఎమ్మెల్సీగా పనిచేసిన కొండా మురళీ కుటుంబం ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నప్పటికీ తాజా పరిణామాల నేపథ్యంలో వారి రాజకీయ భవిష్యత్తు కీలక చౌరస్తాకు చేరిందనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేసిన నేపథ్యంలో తాత్కాలికంగా కాంగ్రెస్ లో కొనసాగుతూ తమకు అనుకూలమైన ఆఫర్ ఇచ్చే రాజకీయ పార్టీలో చేరుతారనే చర్చ ఒక వైపు సాగుతోంది. ఈ మేరకు కొండా ఫ్యామిటీ ఒక నిర్ణయానికి వచ్చి అంతర్గతంగా తమకు టచ్ లోకి వచ్చిన రాజకీయ పక్షాల నేతలు, ఆ పార్టీలో తమ సన్నిహితులతో చర్చలు జరుపుతున్నారనే ఊహాగానాలు జోరందుకున్నాయి. త్వరలో కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెబుతారని భావిస్తున్నారు. ప్రస్తుతం పరిస్థితులు తమకు అనుకూలంగా లేకపోవడం వల్ల కొంత కాలం వేచిచూసే ధోరణితో వ్యవహరిస్తారనే మరో చర్చ కూడా సాగుతోంది. మరో వైపు వచ్చే ఎన్నికలకు కొద్ది కాలం ముందు పార్టీ మారుతారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. శుక్రవారం సోషల్ మీడియాలో కొండా సురేఖ పేరుతో వచ్చిన పోస్టు ఈ రాజకీయ వేడిని మరింత తీవ్రం చేసింది. "ఎదురుచూపులు ముగిశాయి... త్వరలో బిగ్ అప్ డేట్ వస్తోంది. ఎదురు చూడండంటూ" వచ్చిన సందేశం కలకలం సృష్టించగా, ఈ సందేశం తాము చేసింది కాదంటూ సురేఖ ఎక్స్ లో ట్వీట్ చేయడం గమనార్హం.

కొండా ఫ్యామిలికీ మూడు అవకాశాలు

కాంగ్రెస్ పార్టీని వీడితే ఆ ఫ్యామిలీ ముందు మూడు పార్టీల అవకాశాలున్నాయి. మొదటి వరుసలో బీజేపీ ఉంటోంది. రెండవ వరుసలో బీఆర్ఎస్, మూడో పార్టీగా జనసేన పార్టీ ఉందనే ప్రచారం ఉంది. దీనికి తోడు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రెండు స్థానాల్లో తమ కుటుంబ సభ్యుల పోటీకి అవకాశం ఇచ్చే పార్టీలో చేరుతారనే మరో చర్చ సాగుతోంది. ఏ పార్టీ వైపు మొగ్గు చూపుతారు? ఎప్పుడు పార్టీ మారుతారనే ఊహాగానాలు రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతున్నాయి.సీఎం రేవంత్ రెడ్డి పై కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత తీవ్ర విమర్శలు, ఆరోపణలు చేసినప్పటి నుంచి ఈ అంశంపై బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీని రాజకీయంగా ఇరుకునపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. తాజాగా ఆమెను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేసిన తర్వాత బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు, నిజామాబాద్, మహబూబ్ నగర్ బీజేపీ ఎంపీలు ధర్మపురి అర్వింద్, డీకే అరుణ తదితరులు తీవ్రంగా ఖండించడం గమనార్హం. ఒక విధంగా కొండా సురేఖ పట్ల బీజేపీ నాయకులు సానుకూల వైఖరిని ప్రదర్శిస్తూ వస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. బీఆర్ఎస్ నాయకులు సైతం కాంగ్రెస్ ను విమర్శిస్తున్నప్పటికీ తమ రాజకీయ ప్రయోజనానికి ప్రాధాన్యతనిస్తున్నారు. ఈ నేపథ్యంలో కొండా ఫ్యామిలీ బీజేపీలో చేరుతారా? చేరితే వీరి 'స్వభావానికి' ఆ పార్టీలో ఇముడ గలుగుతారా? అనే ప్రశ్నలు ఉండగా మరో వైపు బీజేపీలో చేరితే ఎమ్మెల్యేగా రాజీనామా చేయాలనే షరతు విధించే అవకాశం ఉంటుందంటున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఉప ఎన్నికలను ఎదుర్కొనేందుకు సిద్ధమవుతారా? అనేది పెద్ద ప్రశ్న. బీజేపీలో చేరేందుకు సిద్ధమైతే కొండా ఫ్యామిలీ డిమాండ్ చేసే పరకాల, వరంగల్ తూర్పు రెండు టికెట్లు ఇచ్చేందుకు బీజేపీ లాంటి జాతీయ పార్టీలు అంగీకరిస్తాయా? అనే అనేక ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.



అయితే తెలంగాణలో అధికారంపై కన్నేసిన బీజేపీ.. కాంగ్రెస్ పార్టీని ఇరుకునపెట్టేందుకు, రానున్న రోజుల్లో అధికారంలోకి వచ్చేందుకు కొండా కుటుంబానికి పార్టీలో అవకాశం కల్పించే అవకాశాలు లేక పోలేదంటున్నారు. పైగా బీజేపీ తెలంగాణలో బీసీ జపం చేస్తున్న విషయాన్ని పరిశీలకులు గుర్తుచేస్తున్నారు. ఇక రెండవ అవకాశంగా బీఆర్ఎస్ పార్టీలో చేరే ఛాన్సు ఉంది. అయితే గతంలో బీఆర్ఎస్ లో కొండా ఫ్యామిలీ పనిచేసింది. ఆ పార్టీని వీడిన సందర్భంలో తీవ్ర విమర్శలు చేసిన సందర్భాన్ని ప్రస్తుతం గుర్తుచేస్తున్నారు. అయితే రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరనే అంశాన్ని లేవనెత్తుతూ, వచ్చే ఎన్నికల్లో తిరిగి అధికారంలోకి రావాలనే లక్ష్యంతో ఉన్న బీఆర్ఎస్ కొండా కుటుంబాన్ని చేర్చుకుని కాంగ్రెస్ ను ఇబ్బందుల్లోకి నెట్టే అవకాశం కూడా లేకపోలేదంటున్నారు. దీనికి తోడు వచ్చే ఎన్నికల నాటికి తెలంగాణలో అసెంబ్లీ స్థానాలు పెరుగుతాయని, ఈ నేపథ్యంలో వీరికి అవకాశం కల్పించే అవకాశం కూడా ఉందనే చర్చ సాగుతోంది. అయితే కొండా ఫ్యామిలీతో ఆ పార్టీకి చేదు అనుభవం ఉన్నందున తమ పార్టీలో చేర్చుకునే అంశం పై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.కొండా కుటుంబాన్ని తమ పార్టీలో చేర్చుకోవాలనే ఆలోచన లేదని ఆ పార్టీ మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి స్పష్టం చేశారు. మా వైపు నుండి ఆ ప్రయత్నం లేదని ప్రకటించడంతో ఆ పార్టీలో ద్వారాలు మూసేశారా? లేక రాజకీయ వ్యూహంలో భాగంగా ఆ ప్రకటన చేశారా? అనే చర్చ సాగుతోంది.ఇదిలా ఉండగా మూడవ అవకాశంగా జనసేన పార్టీలో చేరుతారనే చర్చ ఉంది. అయితే తెలంగాణలో నెలకొన్న ప్రత్యేక పరిస్థితిలో రానున్న కాలంలో ఆ పార్టీకి లభించే ఆదరణ ఎంతనే ప్రశ్నలున్నాయి. మరో వైపు ఆ పార్టీలో చేరి తమ రాజకీయ భవిష్యత్తును నిల బెట్టుకోవడం కూడా కష్టమనే ప్రశ్నలున్నాయి. కొండా సుస్మిత జనసేన వైపు మొగ్గు చూపుతున్నారనే ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో పార్టీ అంటూ మారితే ఏ పార్టీలో చేరుతారు? ఆ పార్టీలో వీరికి దక్కే గౌరవం, ప్రాధాన్యం ప్రధానమంటున్నారు.

కాంగ్రెస్ పార్టీయే దిక్కా?

ఇదిలా ఉండగా, ఇప్పటికే కాంగ్రెస్ పార్టీలో జరిగే నష్టం జరిగినప్పటికీ ఉన్న ఎమ్మెల్యే పదవిని కాపాడుకుంటూ తిరిగి ఆ పార్టీలో తమ ప్రాధాన్యతను పెంచుకునే అవకాశం లేకపోలేదంటున్నారు. కాంగ్రెస్ పార్టీలో ఇవన్నీ సహజమనే అభిప్రాయం కూడా ఉంది. అయితే ఇంత రాద్ధాంతం, విమర్శలు, వ్యతిరేకత నెలకొన్న స్థితిలో ఆ పార్టీలో కొనసాగడం కష్టమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే అలా అని తమ రాజకీయ భవిష్యత్తును అగాథంలో వారే పడవేసుకుంటారా? అనే అభిప్రాయం ఉంది. ఏది ఏమైనా నిన్నటి వరకు మంత్రిగా వెలుగువెలిగిన కొండా ఫ్యామిలీని ఒక్కసారిగా రాజకీయ కష్టాలు చుట్టుముట్టాయంటున్నారు. అందుకే జరిగిన నష్టమేదో జరిగినప్పటికీ ఆచితూచి వ్యహరిసారా? ఆత్మగౌరవం పేరిట అనూహ్య నిర్ణయం తీసుకుంటారా? అనే మరో అభిప్రాయం వ్యక్తమవుతోంది.

స్వంత పార్టీలో తీవ్ర సవాళ్ళు!

కాంగ్రెస్ పార్టీలో కొండా ఫ్యామిలీ ఇంత కాలం కొన్ని సవాళ్ళు ఎదురైనప్పటికీ అనేక కారణాల నేపథ్యంలో నెగ్గుకొచ్చారు. మూడు దశాబ్దాల రాజకీయ జీవితం, అందులో కాంగ్రెస్ పార్టీలోనే ఎక్కువ కాలం కొనసాగడం, బీసీ సామాజిక వర్గం, మహిళ అనే అనేక అంశాలు కలిసొచ్చాయి. స్వంత జిల్లాల్లో అందరితో విభేదాలు నెలకొన్నా ఒంటరిగా ముందుకు నడిచారు. కానీ, ఇప్పుడు ఒక్కసారిగా పరిస్థితులన్నీ తిరుగబడ్డాయి. కాంగ్రెస్ లో కొనసాగితే రానున్న రోజులు అంత సానుకూలంగా ఉండకపోవచ్చంటున్నారు. ఇప్పటికే సీఎం రేవంత్ తో విభేదాలు, జిల్లాకు చెందిన సహచర ఎమ్మెల్యేలు కడియం, రేవూరి, నాయినిలతో మనస్పర్ధలు, జిల్లాకు చెందిన సీఎం సన్నిహితుడైన ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ఇంచార్జ్ మంత్రి పొంగులేటిలను టార్గెట్ చేయడంతో పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. అదే విధంగా తాను ప్రాతినిధ్యం వహిస్తున్న తూర్పులో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యతో వైరం, సురేఖ సామాజిక వర్గానికి చెందిన తాజా కుడా చైర్మన్ గుండు సుధారాణితో పొసగని తీరు ఇవన్నీ ఇప్పుడు ఇబ్బంది కరంగా మారుతాయంటున్నారు.'ఇప్పటికే బస్వరాజు బస్తీమే సవాల్ అంటున్నారు.

# వ్యవసాయ కూలి నుంచి లేడీ డాన్ వరకు..

తిరుపతి,చిన్న గదిలో ఉంటూ.. వ్యవసాయ కూలీగా జీవితం మొదలుపెట్టిన ఓ మహిళ మాజీ మంత్రి కీలక అనుచరుడి సాయంతో లేడీ డాన్గా ఎదిగింది. ఆమె మదలనపల్లెకు చెందిన కోనేటి సులోచన. స్థానికంగా 'లేడీ డాన్'గా చలామణి అవుతూ అనేక అక్రమాలకు పాల్పడింది. శనివారం కోనేటి సులోచన ఇంట్లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. మాజీ మంత్రి ముఖ్య అనుచరుడితో చేతులు కలిపి వందల కోట్ల విలువైన భూములను అక్రమంగా కాజేసిన వ్యవహారం వెలుగులోకి రావడంతో.. కోర్టు ఆదేశాలతో తనిఖీలు నిర్వహించారు. మదనపల్లె డీఎస్పీ బుచ్చిరాజు ఆధ్వర్యంలో సీఐలు మోహన్ కుమార్, రాజారెడ్డి, మహమ్మద్ రఫీలతో కూడిన మూడు టీమ్లు నిర్వహించాయి. సులోచన నివాసంతో పాటు ఆమె సోదరుడు శ్రీనివాసులు ఇంట్లో తనిఖీలు చేశారు. పోలీసులు తనిఖీల్లో 50 రకాల కీలక ఆస్తి డాక్యుమెంట్స్ స్వాధీనం చేసుకున్నారు. వీటిల్లో 15 ఫోర్జరీ సంతకాలు చేసి ఉంచిన పాత ఖాళీ బాండు పేపర్లు బయటపడ్డాయి. అప్పులు ఇచ్చినట్లు నమ్మించి, వారి నుంచి బలవంతంగా ఖాళీ బాండ్లపై సంతకాలు తీసుకుని ఆస్తులు లాక్కోవడానికి వీటిని ఉపయోగించినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ పత్రాలను ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీకి పంపినట్లు డీఎస్పీ తెలిపారు. సులోచన పేరుపై బండకమ్మమీదపల్లెలో రూ.60 కోట్ల విలువైన 502 చదరపు గజాల స్థలం, బిల్డింగ్, పొన్నూటిపాళ్యంలో 1.75 ఎకరాల భూమి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఫోర్జరీ పవర్ ఆఫ్ అటార్నీ దస్తావేజును ఉపయోగించి 10 కోట్ల విలువైన 47 సెంట్ల భూమిని ఆక్రమించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ భూమిని మాజీ మంత్రి భార్య పేరిట 2023 జూన్లో గిఫ్ట్డీడ్గా మార్చినట్లు గుర్తించారు. గతంలో కోట్ల విలువైన భూములను అక్రమంగా రాయించుకున్నారని బాధితులుచ్చిన ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో మదనపల్లె లేడీ డాన్ అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. అయితే పోలీసుల తనిఖీలు చేస్తున్న క్రమంలో సులోచన ఇంట్లో లేదు. ఆమె విజయవాడలో ఉన్నట్లు గుర్తించారు. సులోచన ఇంట్లో స్వాధీనం చేసుకున్న పత్రాల వివరాలను ఇంట్లో ఉన్న ఆమె పిల్లలకు అందజేశారు. బాధితుడు మార్పు వెంకటేష్ నాయుడు ఇచ్చిన ఫిర్యాదుతో కోర్టు ఆదేశాలతో పోలీసులు తనిఖీలు నిర్వహించనట్లు సమాచారం. లేడీడాన్ సులోచనపై మదనపల్లె ఒకటో, రెండో పట్టణ, పోలీసు స్టేషన్లలో 14 క్రిమినల్ కేసులు, రౌడీషీట్ ఉండడం గమనార్హం.

# స్వదేశ్ దర్శన్ పేరుతో బుద్ధిస్ట్ ఎక్స్ పీరియన్స్

శ్రీకాకుళం,స్వదేశ్ దర్శన్ 2.0, ప్రసాద్ పథకాల కింద మొత్తం రూ. 419.30 కోట్లతో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. స్వదేశ్ దర్శన్ పథకంలో రూ. 152 కోట్లతో ఇప్పటికే అరకు గుహలు, సూర్యలంక బీచ్ అభివృద్ధి చేయడంతో పాటు నాగార్జునసాగర్ వద్ద బుద్దిస్ట్ ఎక్స్పీరియన్స్ సెంటర్ కూడా నిర్మిస్తున్నారు. భవిష్యత్లో అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయలో రూ. 101.07 కోట్లతో అరకు కల్చరల్ ఎక్స్పీరియన్స్ సెంటర్, శ్రీకాకుళం జిల్లాలో ప్రసిద్ధి చెందిన అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయ పరిసరాలు, గన్నవరం మైస్ సెంటర్ ఏర్పాటు, నెల్లూరు జిల్లాలో వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి ఆలయ అభివృద్ధి చేయనున్నారు.ఆంధ్రప్రదేశ్లో ఉన్న ప్రకృతి అందాలను బయట ప్రపంచానికి చూయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. టూరిస్ట్ ప్లేస్లుగా పేరొందిన కొన్ని ప్రదేశాలను మరింత అందంగా మార్చేందుకు భారీగా నిధులు వెచ్చిస్తున్నారు. స్వదేశ్ దర్శన్ 2.0, ప్రసాద్ పథకాల కింద మొత్తం రూ. 419.30 కోట్లతో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల అభివృద్ధికి ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది.అరకు, అరసవల్లి, గన్నవరం, వేదిగిరి ప్రాంతాల అభివృద్ధికి కేంద్రానికి ప్రతిపాదనలు పంపిన టెండర్లకు కూడా ఆహ్వానించింది. స్వదేశ్ దర్శన్ పథకంలో రూ. 152 కోట్లతో ఇప్పటికే అరకు గుహలు, సూర్యలంక బీచ్ అభివృద్ధి చేయడంతో పాటు నాగార్జునసాగర్ వద్ద బుద్దిస్ట్ ఎక్స్పీరియన్స్ సెంటర్ కూడా నిర్మిస్తున్నారు.అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయలో రూ. 101.07 కోట్లతో అరకు కల్చరల్ ఎక్స్పీరియన్స్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు. కొత్తవలసలో ఐటీడీఏకు చెందిన 19.23 ఎకరాల స్థలంలో దీన్ని అభివృద్ధి చేయనున్నారు. గిరిజన సంస్కృతి, స్థానిక వంటకాలు, అరకు కాఫీ, చిరు ధాన్యాల ప్రత్యేకతలను పర్యాటకులకు పరిచయం చేయనున్నారు.శ్రీకాకుళం జిల్లాలో ప్రసిద్ధి చెందిన అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయ పరిసరాలను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రూ. 107.94 కోట్లతో అరసవల్లి సన్ ఎక్స్పీరియన్స్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు. నాగావళి నది ఒడ్డున చారిత్రక డచ్ హెరిటేజ్ భవనాన్ని పునరుద్ధరించి వినియోగంలోకి తీసుకురానున్నారు.గన్నవరం ఎయిర్పోర్ట్కు కిలోమీటర్ దూరం సుమారు ఐదెకరాల విస్తీర్ణంలో రూ. 176 కోట్లతో గన్నవరం మైస్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు. నెల్లూరు జిల్లాలో వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని రూ. 34.29 కోట్లతో ప్రసాద్ పథకం కింద అభివృద్ధి చేయనున్నారు. వీటితో పాటు స్వదేశ్ దర్శన్ 2.0లో మరికొన్ని ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. మచిలీపట్నంలో కోస్ట్ ఎక్స్పీరియన్స్, మంగళగిరి ఆలయ పరిసరాల్లో పర్యాటక సదుపాయాలు, మంగళగిరి ఎకో పార్క్ అభివృద్ధి, నంద్యాల జిల్లాలో బెలూం గుహల్లో కేవ్ లైటింగ్ వంటి సదుపాయాల కల్పన ఉన్నాయి.

### తెలంగాణ యువతకు ఉద్యోగాలు కావాలి: ఎంపీ వంశీకృష్ణ

పెద్దపల్లి: తెలంగాణ యువత భవిష్యత్తును రాజకీయాలకు బలి చేయకుండా, వారికి విద్య, నైపుణ్యాలు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంపై దృష్టి పెట్టాలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. గత పదేళ్ల పాలనలో యువతకు ఇచ్చిన హామీలు, ఉద్యోగాల విషయంలో జరిగిన పరిణామాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సుమారు 1,500 మంది విద్యార్థులు ప్రాణత్యాగం చేశారని, వారి త్యాగాలతో ఏర్పడిన రాష్ట్రంలో పదేళ్ల పాటు కీలక బాధ్యతల్లో ఉన్న నాయకులు తెలంగాణ యువత భవిష్యత్తుపై మరింత బాధ్యతగా వ్యవహరించాల్సి ఉండేదని ఎంపీ వంశీకృష్ణ అన్నారు."ఐటీ మంత్రిగా ఉన్న సమయంలో తెలంగాణ యువతకు ఎన్ని ఉద్యోగాలు కల్పించారు? యువత నైపుణ్యాలను పెంచేందుకు ఏం చేశారు? ఉపాధి అవకాశాల కోసం ఎలాంటి ప్రణాళికలు రూపొందించారు?" అని కేటీఆర్ను ప్రశ్నించారు.పరీక్షా పత్రాల లీకేజీలు, ఉద్యోగ నియామకాలపై వచ్చిన అవకతవకల ఆరోపణలు విద్యార్థులు, నిరుద్యోగ యువత జీవితాలపై తీవ్ర ప్రభావం చూపాయని ఎంపీ పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసే ఏ చర్యనైనా తాము తీవ్రంగా వ్యతిరేకిస్తామని స్పష్టం చేశారు."సినిమా డైలాగులు చెప్పడం సులభం. కానీ తెలంగాణ ప్రజలకు కావాల్సింది డైలాగులు కాదు.. వాస్తవాలు, ఉద్యోగాలు, భవిష్యత్తు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారు" అని వంశీకృష్ణ అన్నారు.పదవులు శాశ్వతం కాదని, ప్రజల భవిష్యత్తే శాశ్వతమైన అంశమని ఎంపీ వ్యాఖ్యానించారు. కుటుంబ సభ్యులకు పదవులు, నామినేటెడ్ పోస్టులు, ఎమ్మెల్సీ, రాజ్యసభ అవకాశాలు కల్పించారనే విమర్శలు ప్రజల్లో ఉన్నాయని అన్నారు."మేము నామినేటెడ్ పదవులతో రాలేదు. ప్రజలు మాకు ఓటు వేసి గెలిపించారు.


# స్థానిక పోరు టీడీపీకి ప్రాణసంకటం!



అమరావతి,స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని చోట్లా కూటమే గెలవాలనే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. వైసీపీ హయాంలో ఎన్నికలను బహిష్కరించిన టీడీపీ, ఇప్పుడు మాత్రం సంపూర్ణ గెలుపు గురించి మాట్లాడ్డం చర్చనీయాంశమైంది. మరోవైపు వైసీపీ మాత్రం గెలుపోటములతో సంబంధం లేకుండా, బరిలో నిలిచి తీరుతామని ప్రకటించింది. అందుకే స్థానిక సంస్థల ఎన్నికలు యుద్ధాన్ని తలపిస్తాయనే అంచనా.స్థానిక సంస్థల ఎన్నికల్లో సంపూర్ణ విజయాన్ని చంద్రబాబు కోరుకోవడం వెనుక, తీవ్రమైన భయం వుంది. దాన్ని అర్థం చేసుకునేవాళ్లకు మాత్రమే, గెలుపు ప్రాధాన్యం అర్థమవుతుంది. కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపు రెండున్నరేళ్లను సమీపిస్తోంది. ఇంచుమించు సగం పరిపాలన పూర్తి చేసుకోడానికి చేరువలో కూటమి ఉంది.గతంలో ఏ ప్రభుత్వంపై వినిపించని, కనిపించని వ్యతిరేకత... చంద్రబాబు సర్కార్‌పై చూడొచ్చు. అయితే లేనిది ఉన్నట్టు, ఉన్నది లేనట్టు భ్రమింపచేయడంలో చంద్రబాబు సామర్థ్యం అందరికీ తెలిసిందే. తరచూ సర్వే నివేదికలు తెప్పించుకుంటున్నానని, ప్రజల్లో మంచి పాజిటివిటీ వుందని నిన్నటి టీడీపీ నాయకుల సమావేశంలో చంద్రబాబు అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో కంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని ఆయన ఆదేశించడం గమనార్హం.ఇక్కడే అసలు ట్విస్టు వుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీకి ఏ మాత్రం ఆశాజనక ఫలితాలు వచ్చినా, ఆ మరుక్షణం నుంచే తమను సక్రమంగా పరిపాలన చేసుకోనివ్వరని చంద్రబాబుకు బాగా తెలుసు. వైసీపీ మళ్లీ అధికారంలోకి వస్తుందనే సంకేతాల్ని స్థానిక సంస్థల ఫలితాలు ఇస్తే, ఏ ఒక్కరూ కూటమిలో బలంగా నిలబడరు. ఈ వాస్తవం అందరి కంటే చంద్రబాబుకే బాగా తెలుసు. అందుకే ఎట్టి పరిస్థితుల్లోనూ, ఏం చేసైనా సరే, స్థానిక సంస్థల ఎన్నికల్లో సంపూర్ణ విజయాల్ని కూటమే నమోదు చేసుకోవాలని చంద్రబాబు తాపత్రయ పడుతున్నారు.దీనంతటికి వైఎస్ జగన్ అంటే భయమే కారణం. అందుకే అపరిమితమైన అధికారం చేతిలో ఉన్నప్పటికీ, ప్రజలు ఏం చేస్తారో అని చంద్రబాబు, ఆయన పార్టీ నాయకులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మరోవైపు ఒక్కటంటే ఒక్క ఏకగ్రీవం ఉండకూడదని వైఎస్ జగన్ తమ పార్టీ నాయకులను గట్టిగా హెచ్చరించారు. అందుకే స్థానిక సంస్థల ఎన్నికల్లో చావోరేవో తేల్చుకోడానికి వైసీపీ నాయకులు సిద్ధంగా ఉన్నారు.ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలను చంద్రబాబు అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ప్రతి జిల్లాకు ఇన్‌చార్జ్‌తో పాటు రకరకాల సమన్వయకర్తల్ని నియమించారు. పోలీసు యంత్రాంగం ద్వారానే స్థానిక సంస్థల ఎన్నికల్ని నిర్వహించాలనేది టీడీపీ వ్యూహం.గతంలో పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికల్ని ఏ రకంగా కూటమి ప్రభుత్వం నిర్వహించిందో అందరూ చూశారు. ఇదేమని ఎవరైనా ప్రశ్నిస్తే, వైసీపీ హయాంలో స్థానిక సంస్థలకు ఎంత దుర్మార్గంగా ఎన్నికలు జరిగాయో చూడలేదా? అని ప్రశ్నిస్తున్నారు.ఎన్నికలనేవి కేవలం టీడీపీ, వైసీపీ వ్యవహారం కానేకాదు. ప్రజలకు సంబంధించినవి. వైసీపీ చేయకూడని తప్పులు చేయడం వల్లే ఆ పార్టీకి కేవలం 11 అసెంబ్లీ సీట్లే ఇచ్చారు. తాము కూడా అదే దుస్థితిని కోరుకుంటుంటే, ముఖ్యంగా టీడీపీ దుర్మార్గాలకు పాల్పడొచ్చు. తమ రాజకీయ గోతిని తావే తవ్వుకుంటామంటే, అడ్డుపడేదెవరు?కానీ టీడీపీ ఆలోచన ఎలా వుందంటే, స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీకి 40 శాతం ఫలితాలు సానుకూలంగా వస్తే, ఇప్పటి నుంచే తమకు రాజకీయంగా కౌంట్‌డౌన్ మొదలవుతుందనే భయం కనిపిస్తోంది. అందుకే ఎట్టి పరిస్థితుల్లోనూ స్థానిక సంస్థల ఎన్నికల్లో 90 శాతానికి పైగా ఫలితాల్ని సాధించాలనే పట్టుదల కనిపిస్తోంది. ఇందుకోసం ఏమైనా చేయాల్సిందే అన్నట్టుగా మంత్రులు, ఎమ్మెల్యేలు మానసికంగా సిద్ధమవుతున్నారు.సహజంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీకి ఫలితాలు అనుకూలంగా వుంటాయి. కానీ కీడెంచి, మేలు ఎంచాలని టీడీపీ అంటోంది. ఒకవేళ స్వేచ్ఛగా ఎన్నికలు నిర్వహిస్తే, ఖర్మకాలి వైసీపీకి అనుకూల ఫలితాలు వస్తే, అనే ప్రశ్నే, వారిని భయపెడుతోంది. అందువల్లే స్థానిక సంస్థల ఎన్నికలు టీడీపీ పాలిట ప్రాణసంకటం అనే మాట వినిపిస్తోంది.ముఖ్యంగా చంద్రబాబు భయం వెనుక అనేక కారణాలున్నాయనేది సుస్పష్టం. అధికారం వుండగానే, పవర్స్ కోల్పోవడానికి ఏ పాలకుడైనా ఎలా అంగీకరిస్తారనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఆ ప్రశ్నే, రానున్న రోజుల్లో స్థానిక పోరు ఎలా జరగాలన్న దానిపై ఆధారపడి వుంటుంది.

# రాజకీయం అంటే డ్రామాలే – రక్తి కట్టించినవారే విజేత !





హైదరాబాద్,రాజకీయాల్లో వ్యూహాలు ఎంత పక్కాగా ఉన్నా, ఒక్క చిన్న పొరపాటుతో సీన్ ఎలా రివర్స్ అవుతుందో చెప్పడానికి నాటి బీఆర్ఎస్ పాలనలోని సంఘటనల నుంచి నేటి శాసనసభ పరిణామాల వరకు అనేక ఉదాహరణలు కనిపిస్తాయి. గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు అప్పటి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సంపత్ కుమార్‌లపై వేటు వేసేందుకు హెడ్‌ఫోన్స్ విసిరిన చిన్న ఘటనను ఏ రీతిలో వినియోగించుకున్నారో రాజకీయ వర్గాలకు బాగా తెలుసు. ఆనాడు మండలి ఛైర్మన్ స్వామిగౌడ్‌కు దూరంగా పడిన హెడ్‌ఫోన్స్‌ను కంటికి గాయమైందంటూ ఆసుపత్రిలో చేర్పించి, సభ్యత్వ రద్దు వరకు తీసుకెళ్లడం ఒక పక్కా పొలిటికల్ డ్రామాగా సాగింది.

### రివర్స్‌లో ఇదే తరహా పొలిటికల్ డ్రామా

సరిగ్గా అదే తరహా పొలిటికల్ డ్రామా సోమవారం శాసనసభ లోపలా బయటా మళ్లీ పునరావృతమైంది. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆత్మరక్షణలో పడేయాలనే వ్యూహంతో బీఆర్ఎస్ ప్రణాళికాబద్ధంగా రంగంలోకి దిగింది. నిరసనలు, మగ ఎమ్మెల్యేలకు గాయాలయ్యాయనే ప్రచారం, మహిళా ఎమ్మెల్యేలకు అవమానం జరిగిందంటూ కన్నీళ్లు పెట్టుకోవడం వరకు అన్నీ అనుకున్నట్లే సాగాయి. ఉదయం పూట మీడియా కవరేజ్ మొత్తం బీఆర్ఎస్ నిరసనలతోనే నిండిపోయింది. ప్రతిపక్షం పన్నిన ఈ సెంటిమెంట్, నిరసనల ట్రాప్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం చిక్కుకుని ఆత్మరక్షణలో పడాల్సిన పరిస్థితి స్పష్టంగా కనిపించింది.

### తాతా మధు వ్యాఖ్యల క్లిప్‌తో రంగంలోకి కాంగ్రెస్

అయితే, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు ఆవేశంలో చేసిన వ్యాఖ్యల వీడియో క్లిప్ టీవీల్లో ప్రసారం కావడమే ఆలస్యం.. మైండ్ గేమ్‌ను తిప్పికొట్టేందుకు కాంగ్రెస్‌కు ఊహించని పెద్ద అవకాశం లభించింది. ఇన్నాళ్లూ కౌంటర్ దాడి కోసం ఎదురుచూస్తున్న కాంగ్రెస్, తాతా మధు వ్యాఖ్యలను పట్టుకుని క్షణాల్లో ఎదురుదాడి ప్రారంభించింది. గతంలో బీఆర్ఎస్ ఏ రకంగానైతే డ్రామాతో రాజకీయం చేసిందో, ఇప్పుడు కాంగ్రెస్ కూడా అదే దారిలో పయనిస్తూ సభా సంప్రదాయాలు, దళిత సెంటిమెంట్, స్పీకర్ అవమానం అనే అంశాలను తెరపైకి తెచ్చి కన్నీళ్లు, భావోద్వేగాలతో వాతావరణాన్ని వేడెక్కించింది.

### డ్రామా రక్తి కట్టించిన వారే విజేత

రాజకీయాల్లో ఏ పక్షమూ తక్కువ తి నలేదనే విషయాన్ని ఈ రెండు ఘటనలు నిరూపిస్తున్నాయి. బీఆర్ఎస్ ఎంత వ్యూహాత్మకంగా డ్రామా నడిపినా, ఒక్క నేత చేసిన తొందరపాటు వ్యాఖ్యను కాంగ్రెస్ అంతకంటే పెద్ద డ్రామాగా మలచడంలో సక్సెస్ అయింది. సభలో స్పీకర్ భావోద్వేగానికి గురికావడం, మంత్రులు తీవ్రంగా విరుచుకుపడటంతో నిరసనలతో బీఆర్ఎస్ సాధించిన పొలిటికల్ మైలేజ్ అంతా ఒక్కసారిగా తుడిచిపెట్టుకుపోయింది. ప్రతిపక్షం తొందరపడి వేసిన తప్పటడుగు కాంగ్రెస్‌కు రాజకీయంగా సంజీవనిలా పనిచేసింది. నిరసనలతో ప్రభుత్వాన్ని కార్నర్ చేయాలని భావించిన బీఆర్ఎస్, చివరికి తమ సొంత నేత చేసిన వ్యాఖ్యల వల్ల తామే సృష్టించిన ట్రాప్‌లో తామే ఇరుక్కుపోవాల్సి వచ్చింది. చివరికి తాతా మధుతో క్షమాపణలు చెప్పించి రేసు నుంచి తప్పుకోవడంతో, ఈ సోమవారం నాటి అసెంబ్లీ పొలిటికల్ డ్రామాలో కాంగ్రెస్ పూర్తిస్థాయి విజేతగా నిలిచింది.

# గాంధీ సూపరింటెండెంట్‌గా డాక్టర్ ఉషారాణి

హైదారబాద్: సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ టి.ఉషారాణిని నియమిస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు ఆ పోస్టులో కొనసాగిన డా.వాణి డీఎంఈగా పదోన్నతిపై వెళ్లడంతో సూపరింటెండెంట్ పోస్టు సుమారు నెల రోజులు ఖాళీగా ఉంది. దీంతో ప్రభుత్వం నాగర్‌కర్నూల్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఉషారాణిని గాంధీ ఆసుపత్రికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గాంధీ ఆస్పత్రిలో అదనపు డీఎంఈగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ సీహెచ్ రాజకుమారిని పరిపాలనా కారణాలతో తక్షణమే రిలీవ్ చేయాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



# 9 కి.మీ. భారీ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంతో తప్పనున్న ట్రాఫిక్ కష్టాలు

హైదరాబాద్, హైదరాబాద్ మహానగరం రోజురోజుకు అభివృద్ధి చెందుతోంది. భాగ్యనగరం కొన్ని చోట్ల ఔటర్ రింగ్ దాటి పోయింది. ఈ నేపథ్యంలో సిటీలో నివసించే వారి సంఖ్య భారీగా పెరిగింది. వాహనాల సంఖ్య కూడా భారీగా పెరిగింది. కానీ అందుకు తగ్గట్లు రోడ్లు మాత్రం పెరగలేదు. దీంతో వాహనదారులు రోడ్డు ఎక్కలంటేనే భయపడిపోతున్నారు. ముఖ్యంగా జూబ్లీహిల్స్, బంజరాహిల్స్, హైటెక్ సిటీ, గచ్చిబౌలి ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ జామ్ అవుతుంది. ప్రభుత్వం ఫ్లైఓవర్లు ఏర్పాటు చేసినా ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఎలివేటెడ్ కారిడార్లు నిర్మించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా బంజారాహిల్స్ నుంచి గచ్చిబౌలిలోని శిల్పా లేఅవుట్ వరకు నిర్మించతలపెట్టిన ఎలివేటెడ్ కారిడార్‌కు సంబంధించి హెచ్ఎండీఏ తాజాగా టెండర్లు ఆహ్వానించింది. సెప్టెంబర్ 22వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా బిడ్లు స్వీకరిస్తామని ప్రకటించింది. టెండర్లు ఖరారైన తర్వాత పనులకు ప్రారంభిస్తారని వెల్లడించింది.ఈ ఎలివేటెడ్ కారిడార్ అందుబాటులోకి వస్తే బంజారాహిల్స్, ఐటీ కారిడార్ ప్రయాణికులకు ట్రాఫిక్ నుంచి ఉపశమనం లభించనుంది. ఈ ఎలివేటెడ్ కారిడార్ ను బంజారాహిల్స్ రోడ్డు నంబరు 12 నుంచి గచ్చిబౌలి సమీపంలోని శిల్పా లేఅవుట్ ఫ్లైఓవర్ వరకు నిర్మించనున్నారు. ~ాశ్రీంశీ =ఘుం హైదరాబాద్ సిటీ ఆఫ్ పెర్ల్స్ కు బిగ్ షాక్.. కొనేవారు లేక వెలవెలబోతున్న ముత్యాల వ్యాపారం.. కారణం



ఏంటంటే.. దీని పొడవు 9 కిలోమీటర్ల పొడవు ఉండనుంది. పశ్చిమ హైదరాబాద్‌లో అత్యంత రద్దీగా ఉండే ప్రధాన కూడళ్ల మీదుగా ఈ ఎలివేటెడ్ కారిడార్ నిర్మించనున్నారు. రూ.1656 కోట్ల అంచనా వ్యయంతో డిజైన్, బిల్డ్, ఫైనాన్స్, ఆపరేట్, ట్రాన్స్‌ఫర్(డీబీఎఫ్‌వోటీ) ప్రాతిపదికన ఈ కారిడార్‌ను నిర్మిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ ఎలివేటెడ్ కారిడార్ ను రెండు భాగాలుగా విభజించి నిర్మించనున్నారు. ఇందుకు సంబంధించి అధికారులు డీపీఆర్ ఇప్పటికే సిద్ధం చేశారు. మొదటి దశలో ఫిలింనగర్ నుంచి శిల్పా లేఅవుట్ వరకు 5 కి.మీ. ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తారు.

# రేవంత్ మార్క్ పాలిటిక్స్...



హైదరాబాద్, కాంగ్రెస్ లో అంతర్గత కుమ్ములాటలకు, నాయకత్వంపై అసమ్మతి గళాలకు ఏఐసీసీ హైకమాండ్ గట్టి ముగింపు పలికింది. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని బలపరుస్తూ, కేబినెట్ నుంచి కొండా సురేఖను తప్పించడం ద్వారా అధిష్ఠానం స్పష్టమైన సందేశాన్ని ఇచ్చింది. పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి సీఎం పీఠాన్ని అధిరోహించే వరకు ప్రతి అడుగులోనూ పరీక్షలు ఎదుర్కొన్న రేవంత్ రెడ్డి, తాజా పరిణామంతో పార్టీపై తన తిరుగులేని పట్టును మరోసారి నిరూపించుకున్నారు. క్రమశిక్షణారాహిత్యాన్ని ఉపేక్షించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పిన ఢిల్లీ పెద్దలు, అసంతృప్త నేతల దూకుడుకు బలమైన కళ్లెం వేశారు.ప్రభుత్వ విధానాలు లేదా ముఖ్యమంత్రి శైలిపై బహిరంగంగా విమర్శలు గుప్పిస్తున్న నేతలకు కొండా సురేఖ ఉద్వాసన ద్వారా అధిష్ఠానం హెచ్చరికలు జారీ చేసింది. క్రమశిక్షణ తప్పితే అది విస్తరించి పార్టీ ఐక్యతకే ముప్పుగా మారుతుందన్న ఉద్దేశంతోనే కాంగ్రెస్ నాయకత్వం ఈ నిర్ణయం తీసుకుంది. రేవంత్‌ను కాదని మరో ప్రత్యామ్నాయ వర్గాన్ని ప్రోత్సహించే ఆలోచన ఏఐసీసీకి లేదని, సీఎంకు పూర్తి స్వేచ్ఛనివ్వడమే సరైన మార్గమని నాయకత్వం భావించింది. ఫలితంగా, ఇన్నాళ్లూ మంత్రివర్గ విస్తరణలో చోటు కోసం లేదా శాఖల మార్పుపై అసంతృప్తి వెళ్లగక్కుతూ వచ్చిన ఆశావహులు ఇప్పుడు ఆచితూచి మాట్లాడాల్సిన పరిస్థితి ఏర్పడింది. హైకమాండ్ రేవంత్ రెడ్డికి ఇంతటి అండగా నిలవడానికి బలమైన రాజకీయ, ఎన్నికల కారణాలు ఉన్నాయి. 2023 శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడం మొదలుకొని.. ఆ తర్వాత జరిగిన పంచాయతీ, పురపాలక ఎన్నికలు, జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక వరకు రేవంత్ నాయకత్వంలో పార్టీ వరుస విజయాలను నమోదు చేసింది. దక్షిణ భారతదేశంలో పార్టీకి అత్యంత కీలకమైన తెలంగాణలో ప్రత్యర్థి పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీలను నిలువరించడంలో రేవంత్ వ్యూహాలు విజయవంతమయ్యాయి. ఈ పనితీరును గుర్తించిన కాంగ్రెస్ అగ్రనాయకత్వం, రేవంత్ నాయకత్వాన్ని బలహీనపరిస్తే పార్టీ పునాదులకే నష్టమని స్పష్టం చేసింది.త్వరలోనే జరగనున్న కీలకమైన పట్టణ స్థానిక సంస్థల సమరానికి పార్టీని సమాయత్తం చేయడమే అధిష్ఠానం తక్షణ లక్ష్యం. హైదరాబాద్ మెట్రోపాలిటన్ రీజియన్‌లోని క్యూర్ పరిధిలోకి వచ్చే జీహెచ్ఎంసీ, మల్కాజ్‌గిరి, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ల ఎన్నికలు పార్టీ భవిష్యత్తుకు అత్యంత కీలకంగా మారాయి. ఈ నగర పోరుకు ముందు గ్రూపు రాజకీయాలకు స్వస్తి పలికి, ఏకతాటిపై పార్టీని నడిపించేందుకు రేవంత్‌కు పూర్తి స్వేచ్ఛను ఇవ్వాలని అధిష్ఠానం నిర్ణయించింది. ఈ తాజా రాజకీయ మార్పులతో త్వరలో జరగబోయే మంత్రివర్గ విస్తరణ, ప్రక్షాళనపై సీఎం రేవంత్ రెడ్డికి పూర్తి వెసులుబాటు దక్కింది. ప్రస్తుతం కేబినెట్‌లో ఖాళీగా ఉన్న 3 మంత్రి పదవులను భర్తీ చేయడంతో పాటు, మంత్రుల పనితీరు ఆధారంగా శాఖల మార్పిడి చేపట్టే స్వేచ్ఛ ఆయనకు లభించింది. పార్టీపై సంపూర్ణ ఆధిపత్యం దక్కించుకున్నప్పటికీ, అసమ్మతి పూర్తిగా సమసిపోలేదన్న వాస్తవాన్ని గ్రహించిన రేవంత్.. అన్ని సామాజిక వర్గాలను, సీనియర్ నేతలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. పార్టీలో అంతర్గత సమతుల్యతను కాపాడుకుంటూనే, తన నాయకత్వానికి ఎదురులేదని రేవంత్ చాటిచెప్పినట్లయింది.

# దేవాదాయశాఖ సెంటిమెంట్ కంటిన్యూ...

హైదరాబాద్,రాజకీయాల్లో కొన్ని శాఖలకు ప్రత్యేకమైన గుర్తింపు ఉంటుంది. అందులో దేవాదాయ ధర్మాదాయ శాఖది అత్యంత సున్నితమైన స్థానం. దేవుడి మాన్యాలు, ఆలయ పాలనతో ముడిపడి ఉండే ఈ పోర్ట్‌ఫోలియోను బాధ్యతగా భావించినా.. రాజకీయంగా మాత్రం మంత్రులకు అస్సలు కలిసిరావడం లేదు. ఇది త ఆరు దశాబ్దాల చరిత్ర చెప్తున్న చేదు నిజం. తాజాగా మంత్రివర్గం నుంచి కొండా సురేఖ ఉద్వాసనకు గురికావడంతో మరోసారి దేవాదాయ శాఖ సెంటిమెంట్ తెరపైకి వచ్చింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి మొదలుకొని ఇప్పటి ప్రత్యేక తెలంగాణ వరకు.. ఈ శాఖను చేపట్టిన పలువురు నేతల రాజకీయ ప్రస్థానం ఊహించని మలుపులు తిరిగి, క్రమంగా అస్తమించడమో లేదా తెరమరుగవడమో జరుగుతూ వస్తోంది.ఈ శాఖకు మంత్రుల పదవీకాలానికి ఉన్న విచిత్రమైన లింక్ 1962 నుంచే కనిపిస్తుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తొలి మహిళా దేవాదాయ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన సదాలక్ష్మి కేవలం ఏడాది తిరిగేలోపే ఆ పదవిని కోల్పోవాల్సి వచ్చింది. శాఖలో ఆమె తీసుకున్న సంస్కరణలు, నిర్ణయాలపై తీవ్ర వ్యతిరేకత వెల్లువెత్తడంతో సంక్షేమ శాఖకు మార్చారు. ఆ వెంటనే 1967 ఎన్నికల్లో ఆమె పరాజయం పాలయ్యారు. ఇక 1983 జనవరిలో ఎన్టీఆర్ ప్రభుత్వ హయాంలో ఈ బాధ్యతలు చేపట్టిన ఈలి ఆంజనేయులు పదవిలో ఉండగానే కేవలం నెలల వ్యవధిలోనే అనారోగ్యంతో కన్నుమూశారు1999?2004 మధ్య చంద్రబాబు రెండోసారి సీఎంగా ఉన్న సమయంలో దామోదరం ఆంజనేయులు 1999లో దేవాదాయ శాఖ బాధ్యతలు తీసుకున్నారు. 2001 నాటి కేబినెట్ పునర్వ్యవస్థీకరణ, రాజకీయ సమీకరణాల్లో పదవి కోల్పోయారు. ఆ తర్వాత బాధ్యతలు చేపట్టిన దండు శివరామరాజు 2004 సాధారణ ఎన్నికల్లో ఓటమి చెంది, ఆపై ప్రత్యక్ష రాజకీయాలకు దూరమయ్యారు.దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలోనూ ఈ గండం కొనసాగింది. 2004–2005 మధ్య 14 నెలలపాటు బాధ్యతలు నిర్వర్తించిన ఎం.సత్యనారాయణ రావు.. హైదరాబాద్ పరిధిలోని దేవరయాంజాల్ భూముల వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొని పదవిని వీడాల్సి వచ్చింది. క్రీడల శాఖకు మారినా, ఏడాదిలోనే రాజీనామా చేయాల్సి వచ్చింది. అనంతరం 2009 ఎన్నికల్లో వేములవాడ నుంచి పోటీ చేసి ఓడిపోయి రాజకీయాలకు దూరమయ్యారు. వైఎస్ కేబినెట్‌లోనే 2009 మే నుంచి దేవాదాయ శాఖ నిర్వహించిన జూపల్లి కృష్ణారావు, 2011 జూన్ 1న తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. అటు 2014లో



ఏపీ టీడీపీ–బీజేపీ సంకీర్ణ ప్రభుత్వంలో ఈ శాఖ చూసిన మాణిక్యాలరావు 2019 ఎన్నికల్లో కనీసం డిపాజిట్ కూడా దక్కించుకోలేకపోయారు. ఆ తర్వాత ఆయన కన్నుమూశారు.ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ ఏడాది పాటు ఎవరికీ ఈ బాధ్యతలు అప్పగించలేదు. 2014 డిసెంబరులో అల్లోల ఇంద్రకరణ్ రెడ్డికి దేవాదాయ శాఖ దక్కింది. 2018 ఎన్నికల తర్వాత కేసీఆర్ రెండో కేబినెట్‌లోనూ 2023 ఎన్నికల వరకు ఆయనే కొనసాగినప్పటికీ, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలయ్యారు. సుదీర్ఘకాలం శాఖను నడిపించినా ఆయనకు రాజకీయంగా పెద్దగా మైలేజ్ దక్కలేదనే వాదన ఉంది.ఇక 2023 డిసెంబరులో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖలను చేపట్టిన కొండా సురేఖ సైతం పలు రాజకీయ వివాదాల్లో చిక్కుకుని అనూహ్యంగా మంత్రివర్గం నుంచి ఉద్వాసనకు గురయ్యారు. గతంలో కేసీఆర్ హయాంలో ఆరోగ్యశాఖ నిర్వహణ లోపాల వల్ల పదవి కోల్పోయిన డాక్టర్ టి.రాజయ్య, ఇప్పుడు పదవి కోల్పోయిన కొండా సురేఖ.. ఇద్దరూ ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలే కావడం కాకతాళీయం.సంక్షేమ పథకాలు, భారీ బడ్జెట్లు, రాజకీయ పలుకుబడిని పెంచే ఇతర శాఖలతో పోలిస్తే.. దేవాదాయ శాఖ పూర్తి భిన్నమైనది. భూముల వివాదాలు, ఆలయ నిధులు, స్థానిక ఆధిపత్య పోరు ఈ శాఖను నిరంతరం పర్యవేక్షణలో ఉంచుతాయి. కారణాలు పాలనాపరమైనవి కావొచ్చు, రాజకీయ సమీకరణాలు కావొచ్చు.. కానీ దేవాదాయ శాఖ పగ్గాలు పట్టిన నేతలకు కాలం కలిసిరావడం లేదన్న భావన రాజకీయ వర్గాల్లో బలంగా నాటుకుపోతోంది.

# కాంగ్రెస్‌లో భారీ మార్పులు.. 120 మంది యువ నేతలకు పగ్గాలు!

న్యూఢిల్లీ: కాంగ్రెస్‌లో యువ నాయకత్వాన్ని తీర్చిదిద్దే ప్రక్రియ ప్రారంభమైంది. పార్టీ సంస్థాగత మార్పుల్లో భాగంగా 120 మంది కొత్త జాతీయ కార్యదర్శుల ఎంపికకు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ స్వయంగా నేతలను ఇంటర్వ్యూ చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో వారి చురుకుదనం, పనితీరు నివేదిక ఆధారంగా అర్హతలను పరిశీలిస్తున్నారు. జాతీయ స్థాయి పదవుల నియామకాలకు రాజకీయ సీనియారిటీకి బదులుగా పనితీరు, చురుకుదనాన్ని ప్రధాన ప్రామాణికంగా పరిగణిస్తున్నారు.జాతీయ కార్యదర్శి పదవుల కోసం రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ, సంస్థాగత ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ కలిసి నేతలను ఇంటర్వ్యూ చేస్తున్నారు. వివిధ రాష్ట్రాల నుంచి ఎంపికైన నేతలను ఢిల్లీకి పిలిపించారు. సోమవారం 30 మంది నేతలను ఇంటర్వ్యూ చేశారు. రాహుల్‌గాంధీ రాయ్‌బరేలీ రెండు రోజుల పర్యటన నుంచి తిరిగొచ్చిన తర్వాత ఈ ప్రక్రియ మళ్లీ కొనసాగనుంది. ఒక్కోసారి 10 మంది చొప్పున నేతలను ఇంటర్వ్యూ చేస్తున్నారు. గతంలో వారు చేసిన పనులు, ప్రొఫైల్ తదితర అంశాలపై రాహుల్‌గాంధీ ప్రశ్నిస్తున్నారు. ఇంటర్వ్యూకు హాజరవుతున్న నేతల పనితీరు నివేదికలు ఇప్పటికే ఆయన వద్ద ఉన్నాయి.వివిధ రాష్ట్రాల్లో జాతీయ కార్యదర్శుల నియామకానికి కాంగ్రెస్ కసరత్తు ప్రారంభించింది. ప్రస్తుత కార్యదర్శుల్లో 60 శాతానికిపైగా మార్పులు చేసి కొత్త ముఖాలకు అవకాశం కల్పించేందుకు పార్టీ సిద్ధమవుతోంది. కేవలం సిఫార్సులు, సిఫార్సు లేఖల ఆధారంగా కాకుండా క్షేత్రస్థాయి వాస్తవాలు, పని సామర్థ్యం, దూరదృష్టి ఆధారంగా యువతకు అవకాశం కల్పించాలన్నది రాహుల్‌గాంధీ ఉద్దేశం. జాతీయ కార్యదర్శి పదవికి 120 మంది నేతలను ఇంటర్వ్యూ చేయనున్నారు. అనంతరం వారి నియామకం చేపట్టనున్నారు. కాంగ్రెస్ 'సంఘటన్ సృజన్' కార్యక్రమంలో పరిశీలకులుగా పనిచేసిన నేతలకు ఈ పదవుల కోసం ప్రాధాన్యం




ఇస్తున్నారు. 2004లో రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి కాంగ్రెస్ పునరుద్ధరణ, తరాల మార్పు రాహుల్‌గాంధీ ప్రధాన లక్ష్యాల్లో ఒకటిగా ఉంది. యువతను ముందుకు తీసుకురావడంతోపాటు సంస్థాగత వ్యవస్థలో మార్పులకు ఆయన గతంలోనూ ప్రయత్నించారు. యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐలోనూ ఇంటర్వ్యూ ఆధారిత నియామక ప్రక్రియను అనుసరించారు. గతంలో సీనియర్ నేతల వ్యతిరేకత, అంతర్గత విభేదాల కారణంగా ఈ ప్రయత్నాలు ఆశించిన స్థాయిలో ముందుకు సాగలేదు. అయితే ఇటీవల కాంగ్రెస్‌లో జరుగుతున్న మార్పులతో పరిస్థితి మారుతున్నట్లు పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. రాష్ట్ర స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు యువ నేతలకు అవకాశాలు కల్పిస్తున్నారు. దీని కొనసాగింపుగానే జాతీయ కార్యదర్శుల ఎంపిక ప్రక్రియ చేపట్టారు. దేశంలోని అన్ని ప్రాంతాలు, అన్ని వర్గాలకు చెందిన యువతకు అవకాశం కల్పించి సమ్మిళిత బృందాన్ని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ లక్ష్యంగా పెట్టుకుంది.

Edited, Printed, Published & owned by KOTAGIRI CHANDRA SHEKAR, Published From, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001, Printed at KOTAGIRI GRAPHICS & KOTAGIRI OFFSET PRINTER, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001. Editor: KOTAGIRI CHANDRA SHEKAR, RNINo. TELTEL/2022/86880, Cell:9440164140